www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545

# ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

సంపుటి - 4 సంచిక -153 గురువారం17 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## సంస్కరణలను తీసుకువచ్చే దిశగా చర్యలు

- దేశ పన్ను వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాం
- కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్




న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16 (ప్రజావినికిడి):కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ పన్ను వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు సంస్కరణలను తీసుకువచ్చే దిశగా చర్యలు తీసుకుని రావాల్సిన అవసరం ఉందని అన్నారు. పన్ను నిబంధనలలో మార్పుల కోసం వ్యక్తిగత ప్రయోజనాల ఆధారంగా కాకుండా వ్యవస్థకు ఉపయోగపడే రీతిలో విశ్లేషణాత్మక ప్రతిపాదనలతో ముందుకు రావాలని సూచించారు. బెంగళూరులో ఇంటర్నే షనల్ ట్యాక్స్ రీసెర్చ్ అండ్ అనాలిసిస్ ఫౌండేష న్ 8వ అంతర్జాతీయ సదస్సులో ఆమె పాల్గొన్నా రు. ఈ సందర్భంగా ప్రసంగించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న కొన్ని నిబంధనల వల్ల కొందరు పన్ను చెల్లింపుదారులకు ప్రయోజనం కలుగుతోందని అన్నారు. అయినప్పటికీ.. ఈ నిబంధనలు పన్ను వ్యవస్థ సమర్థతను దెబ్బతీసేలా ఉంటే వాటిని తొలగించాలనే గళాన్ని వినిపించే వాళ్లు

మిగతా2లో...

# ౨౨ఏ భూములకు త్వరలో పరిష్కారం

- యూఎల్‌సీ భూములపై త్వరలో కొత్త విధానం
- 22ఏ సమస్యల్లో 12 అంశాలను గుర్తించాం
- పెండింగ్ రిజిస్ట్రేషన్లను వారంలో పరిష్కరిస్తాం
- పొరపాటున 22ఏలో చేరిన భూములు తొలగిస్తాం
- క్రమబద్ధీకరించిన, వేలం భూములకు విముక్తి
- ధరణి పేరిట గత ప్రభుత్వంలో దోపిడీ జరిగింది
- రూ.లక్షల కోట్ల ఆస్తి కొందరి చేతుల్లోకి మారింది
- బీఆర్ఎస్ భూములను ఇష్టారాజ్యంగా బదిలీ
- కేసీఆర్ ఫాంహౌస్ భూములపై విచారణ చేస్తాం
- ఫామ్‌హౌస్‌లో 388 ఎకరాల ప్రభుత్వ భూమి
- ప్రభుత్వ భూమిని నిరుపేదలకు పంచుతాం
- ఫాంహౌస్ భూములపై 30 రోజుల్లో నివేదిక
- శాసనసభలో సిఎం రేవంత్ రెడ్డి ప్రకటన

హైదరాబాద్,సెప్టెంబర్ 16 (ప్రజావినికిడి):22ఏ భూముల సమస్యల పరిష్కారంపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకోనుంది. 22ఏ సమస్యల్లో 12 రకాల అంశాలను గుర్తించామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో తెలిపారు. యూఎల్‌సీ భూముల విషయంలో త్వరలో కొత్త విధానం తీసుకొస్తామని చెప్పారు. అధీకృత లేఅవుట్లలో పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లను వారంలో పరిష్కరిస్తామని సీఎం ప్రకటించారు. హెచ్‌ఎండీఏ, డీటీసీపీ అనుమతులు ఉన్న లేఅవుట్ల రిజిస్ట్రేషన్లు కూడా చేస్తామన్నారు. ఇకపై 22ఏ జాబితాలో భూమిని చేర్చడం, తొలగించడం కోసం స్పష్టమైన నిబంధనలు తీసుకొస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. పొరపాటున వ్యక్తిగత భూములు 22ఏ జాబితాలో చేరితే కలెక్టర్లు, ఆర్డీవోలు వాటిని తొలగించేలా చర్యలు మిగతా2లో...



## ఓటుకు నోటు కేసులో దర్యాప్తు వేగవంతం

రేవంత్ రెడ్డి, సండ్ర పిటిషన్లపై సుప్రీంలో విచారణ




2లో

## 22ఏలో నాలుగు లక్షల ఎకరాలే పట్టా భూములు


- అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు అనుమతి తప్పే
- హరీశ్‌రావు మామ భూములకు ఎలా జరిగింది?
- అప్పుడు నీ బుద్ధి ఎక్కడికి పోయింది హరీష్?
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఫైర్



హైదరాబాద్,సెప్టెంబర్ 16 (ప్రజావినికిడి): మాజీ మంత్రి హరీశ్‌రావుపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు ఏ ప్రభుత్వం అనుమతి ఇచ్చినా అది తప్పేనని, అలాంటప్పుడు హరీశ్‌రావు మామ భూముల విషయంలో రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని ప్రశ్నించారు. "అప్పుడు నీ బుద్ధి ఎక్కడికి పోయింది?" అని హరీశ్‌రావును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అసెంబ్లీ లాబీలో మిగతా2లో...

## ఉద్యాన పంటల విస్తరణకు ప్రభుత్వం పెద్దపీట

- ఈ ఏడాది అదనంగా 2 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు లక్ష్యం
- ఉద్యాన రంగ అభివృద్ధికి రూ.1,000 కోట్లతో కార్యాచరణ
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి



2లో



## యూపీఐ లావాదేవీలు కస్టమర్లకు ఉచితమే..

- కొత్త ఎండీఆర్ విధానంపై ఫోన్‌పే సీఈఓ క్లారిటీ

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16 (ప్రజావినికిడి)::యూపీఐ వినియోగదారులకు ఎలాంటి ఛార్జీలు ఉండవని ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్ స్పష్టం చేశారు. యూపీఐ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను ఆర్థికంగా నిలకడగా కొనసాగించేందుకు కొత్త మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) మిగతా2లో...



## పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితి 25,000

- కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం
- 51 లక్షల మంది లబ్ది పొందే చాన్స్

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16 (ప్రజావినికిడి): దేశంలో పనిచేస్తున్న కోట్లాది మంది వేతన జీవులకు కేంద్ర ప్రభుత్వం అద్భుతమైన వార్త అందించింది. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ పరిధిలోకి వచ్చే సేవకుల వేతన పరిమితిని భారీగా పెంచుతూ కేంద్ర కేబినెట్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. మిగతా2లో...

## ఒక్క గజం భూమి ఎక్కువ ఉన్నా ప్రభుత్వానికే...

- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి అసత్య ఆరోపణలు
- తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత విమర్శ



2లో

## అసెంబ్లీ సాక్షిగా రేవంత్ అబద్ధాలు

- సీఎం కుటుంబానికి 308 ఎకరాల భూమి
- కాంగ్రెస్ అక్రమాలు బయటపెడతామనే మాపై సస్పెన్షన్
- భూభారతి, 22ఏపై సుప్రీం సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి : మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్

హైదరాబాద్,సెప్టెంబర్ 16 (ప్రజావినికిడి):అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు చెప్పారని బీఆర్‌ఎస్‌ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి కుటుంబానికి 308 ఎకరాలు భూమి ఉందన్నారు. వెల్దండ మండలం కొట్ర గ్రామంలోనే 175 ఎకరాలు, వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో 79 ఎకరాలు, ఎన్నికల అఫిడవిట్ ప్రకారం ఇతర భూమి 54 మిగతా2లో...



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# 22ఏ భూములకు త్వరలో పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

చేసిన భూములు, బ్యాంకుల్లో తనఖా పెట్టి వేలం వేసిన భూములను కూడా 22ఏ జాబితా నుంచి తొలగిస్తామని చెప్పారు. ధరణి వ్యవస్థపై గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని సీఎం విమర్శించారు. నీటి ప్రాజెక్టుల తర్వాత కేసీఆర్ దృష్టి భూములపై పడిందని ఆరోపించారు. భూదోపిడీ ఆలోచనల నుంచే ధరణి పుట్టిందన్నారు. కేసీఆర్, సోమేశ్‌కుమార్ కలిసి ధరణిని రూపొందించారని చెప్పారు. ప్రభుత్వం కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టిందన్న ఆరోపణలపైనా రేవంత్ స్పందించారు. అసలు వివాదం 3.73 లక్షల ఎకరాల ప్రైవేట్ పట్టా భూముల గురించేనన్నారు. వాటిని చూపించి కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టారంటూ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. హైకోర్టు ఆదేశాల మేరకు 2025లో నిషేధిత భూముల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచామని సీఎం తెలిపారు. ప్రాజెక్టుల్లో అవినీతి తర్వాత కేసీఆర్ కన్ను భూములపై పడిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. భూ దోపిడీ గురించి చేసిన ఆలోచనల నుంచే ధరణి అనే పురుగు పుట్టిందని, అదే భూతమై సమాజాన్ని పట్టి పీడిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. కోట్ల ఎకరాల భూములకు సంబంధించిన డేటా మాఫియా చేతిలో బీఆర్ఎస్ నాయకులు పెట్టారని ఆరోపించారు. శాసనసభ సమావేశాల సందర్భంగా ధరణిపై జరిగిన చర్చలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. కేసీఆర్, సోమేశ్ కుమార్ తమ మెదడు రంగరించి ధరణి తయారు చేశామని గొప్పలు చెప్పారని, ఆయన చెప్పింది పచ్చి అబద్ధమని సీఎం మండిపడ్డారు. ధరణి పోర్టల్ ద్వారా బీఆర్ఎస్ నేతలు భూములను ఇష్టానుసారం బదిలీ చేసుకున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. తప్పు చేసిన వారు సభకు రాకుండా తప్పించుకుందామనే చూస్తారని సీఎం ఎద్దేవా చేశారు. పట్టుకుని రమ్మని ఆదేశాలిస్తే తప్ప కేసీఆర్ సభకు వచ్చేటట్టు లేరని అన్నారు. రెవెన్యూ సమాచారం కేంద్ర సంస్థ ఎన్ఐసీకి ఇవ్వకుండా ప్రైవేటుకు ఎందుకు ఇచ్చారు? అని ఆయన ప్రశ్నించారు. రూ. 110 కోట్ల విలువైన కాంట్రాక్టు రూ.1400 కోట్ల వాల్యూకు ఎలా వచ్చిందన్న సీఎం, దీనిపై విచారణ చేయాల్సిన అవసరం లేదా? అని ప్రశ్నించారు. 1982లో వచ్చిన భూకబ్జా నిరోధక చట్టాన్ని తెలంగాణ ఏర్పాటు కాగానే కేసీఆర్ రద్దు చేశారని గుర్తుచేశారు. ఆ చట్టాన్ని ఎందుకు రద్దు చేశారో కేసీఆర్ చెప్పాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ ప్రశ్నలకు జవాబు చెప్పాల్సి వస్తుందనే సభ నుంచి పారిపోయారని విమర్శించారు. 2021 నాటికి 21 లక్షల 93వేల 50 ఎకరాలను పార్టు బి కింద నిషేధిత జాబితాలో పెట్టారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 2023 నాటికి ధరణితో తెలంగాణ సమాజానికి కేసీఆర్ గుండు కొట్టారని విమర్శించారు. ధరణిని అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ నేతలు విచ్చలవిడిగా సంపాదించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు, దళారీలు వేర్వేరు కాదని ఇద్దరూ ఒకటేనని రేవంత్ రెడ్డి అన్నారు. కండువా వేస్తే బీఆర్ఎస్ నేత, కండువా తీస్తే దళారీ అని అభివర్ణించారు. అధికారంలోకి వచ్చాక భూముల సమస్య పరిష్కారం కోసం తలలు బద్దలు కొట్టుకున్నామన్నారు. తెలంగాణకు చెందిన 2.5కోట్ల ఎకరాల భూమి డేటా మాఫియా చేతికి వెళ్లిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రజలకు చెందిన భూముల సంపూర్ణ సమాచారాన్ని మాఫియా చేతికి ఇచ్చారని ధ్వజమెత్తారు. కేసీఆర్ సభలో ఉన్నప్పుడే 22ఏ బండారం బయటపెట్టాలని భావించానని తెలిపారు. ఆ విషయం తెలిసి కావాలనే బీఆర్ఎస్ సభ్యులు సస్పెండ్ అయ్యేలా వ్యవహరించారన్నారు. బండారం బయటపడుతుందనే బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి పారిపోయారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ధరణి 2010లో ఒడిశాలో మొదలైందని రేవంత్ రెడ్డి అన్నారు. 2014లో కాగ్? ధరణిపై తీవ్రంగా ఆక్షేపించిందన్నారు. 2018లో ధరణి కాంట్రాక్టును ఐఎల్?ఎఫ్?ఎస్? దక్కించుకుందని వివరించారు. ఐఎల్?ఎఫ్ఎస్?, ధరణిని టెరాసిస్ అనే కంపెనీకి అమ్ముకుందని విమర్శించారు. టెరాసిస్ కంపెనీలో శ్రీధరరాజుకు వాటా ఉందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. మరోవైపు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌పై సమగ్ర విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. బుధవారం శాసనసభలో మాట్లాడిన ఆయన, ఈ విచారణను 30 రోజుల్లోగా పూర్తి చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కేసీఆర్‌కు 700 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందో లేదో నిగ్గుతేల్చాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అందులో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఈ విషయాన్ని కేసీఆర్ ఎందుకు వెల్లడించలేదని ఆయన ప్రశ్నించారు. విచారణలో ఆ భూమి ప్రభుత్వానిదని తేలితే, దాన్ని నిరుపేదలకు పంచిపెడతామని సభలో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కుటుంబానికి ఉన్న భూముల వివరాలను కూడా రేవంత్ రెడ్డి వెల్లడించారు. కేసీఆర్ కుటుంబానికి సిద్దిపేటలో 67.5 ఎకరాలు, కేటీఆర్ కుటుంబానికి 123 ఎకరాలు, హరీశ్‌రావు కుటుంబానికి 30 ఎకరాలు, కవిత కుటుంబానికి 37 ఎకరాల భూమి ఉన్నట్లు తెలిపారు. తొమ్మిది జిల్లాల పరిధిలోని 24 మండలాల్లో కల్వకుంట్ల కుటుంబానికి మొత్తం 439 ఎకరాల భూమి ఉందని ఆయన పేర్కొన్నారు. జోగినపల్లి సంతోష్ కుమార్ కుటుంబానికి 79 ఎకరాలు, నవీన్ రావుకు 52 ఎకరాలు, కొండల్ రావుకు 48 ఎకరాల భూమి ఉందని వెల్లడించారు. కేటీఆర్ జన్వాడ ఫామ్ హౌస్‌పై తాను బాంబులు ఎందుకు వేస్తానని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. నేనేమైనా బిన్ లాడెన్‌నా అని ఆయన ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. అదే సమయంలో, ఎల్బీనగర్ పరిధిలోని జీవో 118 కింద ఉన్న భూముల క్రమబద్ధీకరణపై కూడా సీఎం కీలక ప్రకటన చేశారు. ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్న సుమారు 9,500 మందికి త్వరలోనే శుభవార్త అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# అసెంబ్లీ సాక్షిగా రేవంత్ అబద్ధాలు

(మొదటి పేజీ తరువాయి)

ఎకరాల చొప్పున ఉందని వివరించారు. రేవంత్‌రెడ్డి కుటుంబ భూముల వివరాలు అన్ని త్వరలో మరిన్ని బయటకి వస్తాయని చెప్పారు. ప్రజల సమస్యలు, ఆరు గ్యారెంటీల అమలుపై బీఆర్ఎస్ ప్రశ్నిస్తుంటే, డైవర్షన్ రాజకీయాలకు సీఎం రేవంత్‌రెడ్డి తెరలేపుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కుట్రపూరితంగా అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేసిందని చెప్పారు. ప్రభుత్వ అక్రమాలను బయటపెడతామనే సభలో లేకుండా చేశారని అన్నారు. రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో మాట్లాడినవన్నీ అర్ధసత్యాలు, అబద్ధాలని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పార్లమెంటుకు టీ షర్ట్, స్టిక్కర్లు వేసుకుని వెళ్తే ఒప్పు, తాము టీ షర్టు వేసుకుని అసెంబ్లీకి వస్తే తప్పా? అని ప్రశ్నించారు. పార్లమెంటు, అసెంబ్లీ నియమాలు వేరా? అని అడిగారు. **పథకం ప్రకారమే గెంటేశారు** వృద్ధులకు రూ.నాలుగు వేల పెన్షన్, మహిళలకు రూ.2500 ఇవ్వలేదనీ, విద్యార్థులకు భరోసా కార్డు ఇవ్వలేదని హరీశ్‌రావు విమర్శించారు. ఈ వైఫల్యాలను టీ షర్ట్ మీద రాసుకొస్తే తమను సస్పెండ్ చేశారని అన్నారు. తాము కావాలని అసెంబ్లీ నుంచి బయటకు రాలేదనీ, పక్కా పథకం ప్రకారమే గెంటేశారని విమర్శించారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి గొంతు పిసికి, సునీతా లక్ష్మారెడ్డి చీర లాగితే.. కనీసం మైక్ ఇవ్వాలని అడిగినందుకు సస్పెండ్ చేశారని అన్నారు. తాము సభలో ఉంటే కాంగ్రెస్ కుంభకోణాలు, రేవంత్‌రెడ్డి కుటుంబ అవినీతి బయటపడుతుందనే భయంతోనే మొత్తం సెషన్‌కి తమను సస్పెండ్ చేశారని వివరించారు. సస్పెన్షన్ ఎత్తేస్తే ఆధారాలతో సభకు వస్తామని తమ ఎమ్మెల్యేలు సవాల్ చేశారని గుర్తు చేశారు. సీపీఐ, బీజేపీలు అడిగినా సస్పెన్షన్ ఎత్తేసే దమ్ము సీఎంకు లేదన్నారు.

# ఉద్యాన పంటల విస్తరణకు ప్రభుత్వం పెద్దపీట

**హైదరాబాద్,సెప్టెంబర్ 16 (ప్రజావినికిడి)::**రాష్ట్రంలో వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు పంటల వైవిధ్యీకరణలో భాగంగా ఉద్యాన పంటల సాగును పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నా మని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత-జౌళి శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం శాసనసభలో ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగుకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. 2026--27 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో వివిధ పథకాల కింద అదనంగా 2 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలను సాగులోకి తీసుకురావాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని మంత్రి తెలిపారు. పండ్లు, కూరగాయలు, ఆయిల్‌పామ్ తదితర పంటల వైపు రైతులను మళ్లించేందుకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉద్యాన పంటల సాగు విస్తరణకు అవసరమైన మొక్కలు, ఎరువులు, మల్చింగ్, షేడ్‌నెట్, ఫామ్‌పాండ్లు, శీతల గిడ్డంగులు, శాశ్వత పందిళ్లు, బిందు, తుంపర సేద్యం వంటి సదుపాయాలను నిబంధనల ప్రకారం 40 శాతం నుంచి 90 శాతం వరకు రాయితీపై అందిస్తున్నామని మంత్రి వెల్లడించారు. 2026--27లో మొక్కలు, మల్చింగ్, షేడ్‌నెట్, కోత అనంతర నిర్వహణ సదుపాయాలు, శీతల గిడ్డంగులు, ఉద్యాన యాంత్రీకరణ, శాశ్వత పందిళ్ల కోసం రూ.150 కోట్లు, బిందు, తుంపర సేద్యం కోసం రూ.243 కోట్లు, ఆయిల్‌పామ్ అభివృద్ధికి రూ.261 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 88,282 మంది రైతులు 3.20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని మంత్రి తెలిపారు. చీవీజూ-ూా పథకం కింద 2021--22 నుంచి ఇప్పటివరకు 2.74 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టి తెలంగాణ దేశంలో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. 2023 డిసెంబర్ నుంచి 1.37 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగును విస్తరించామని చెప్పారు. 2026--27 సంవత్సరానికి 85 వేల ఎకరాల లక్ష్యానికి గాను ఇప్పటివరకు 29,053 ఎకరాల్లో మొక్కలు నాటినట్లు మంత్రి వెల్లడించారు. సాంప్రదాయ పంటలతో పోలిస్తే ఆయిల్‌పామ్‌కు ఉన్న ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పంటల వైవిధ్యీకరణలో భాగంగా ప్రభుత్వం ఈ పంటను ప్రోత్సహిస్తోందన్నారు. రైతులను ఆయిల్‌పామ్ సాగు వైపు ప్రోత్సహించేందుకు మొక్కలు, డ్రిప్, మొదటి నాలుగేళ్లకు ఎరువులు, అంతర పంటల సాగు తదితరాలకు కలిపి ఎకరానికి రూ.46,250 వరకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు. ఫామ్‌పాండ్లు, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను కూడా రాయితీపై అందిస్తున్నట్లు చెప్పారు. ఆయిల్‌పామ్ చట్టం--1993 ప్రకారం ఫ్యాక్టరీ జోన్ కేటాయించిన ప్రతి ఆయిల్‌పామ్ కంపెనీ ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ప్రతి నెలా ఆయిల్‌పామ్ గెలలను కొనుగోలు చేయాల్సి ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆయిల్‌పామ్ గెలలకు టన్నుకు రూ.24,025 ధర ఉందన్నారు. కనీస హామీ ధర (వీ+ూా) ప్రకటించాల్సింది కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని, అయినప్పటికీ రైతులకు మరింత భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని వీ+ూా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం నాలుగు ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ మిల్లులు పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు.

# ఒక్క గజం భూమి ఎక్కువ ఉన్నా ప్రభుత్వానికే...

**హైదరాబాద్,సెప్టెంబర్ 16 (ప్రజావినికిడి):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన భూ ఆరోపణలపై తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత తీవ్రంగా స్పందించారు. తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తుల కంటే ఒక్క గజం భూమి అదనంగా ఉన్నట్లు నిరూపించినా, ఆ భూమిని ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె సవాల్ విసిరారు. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి తన కుటుంబంపై అసత్య ఆరోపణలు చేశారని, ఆయన మాటలపై తమకు విశ్వాసం లేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని ఆమె డిమాండ్ చేశారు.

కేవలం తనపైనే కాకుండా, అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రస్తావించిన 'గుంటనక్క'తో పాటు కేసీఆర్ ఫాంహౌస్‌లోని సీఎం గూఢచారి, నవీన్ రావు, కొండల్ రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, రామేశ్వర్ రావు, ప్రతిమ శ్రీనివాస్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి తదితరులందరి భూములపై సమగ్ర విచారణ జరిపించాలని కవిత డిమాండ్ చేశారు. 'గుంపు మేస్త్రీ – గుంటనక్క' ముమ్మాటికీ కలిసే ఉన్నారని ఈ సందర్భంగా కవిత వ్యాఖ్యానించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కానీ, ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించిన దానికంటే గజం భూమి అదనంగా ఉన్నా ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలు, కవిత సవాల్‌తో రాష్ట్ర రాజకీయాల్లో భూముల వివాదం మరింత వేడెక్కింది.

# సంస్కరణలను తీసుకువచ్చే దిశగా చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడు అవసరం అయ్యారని వ్యాఖ్యానించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు, పన్నుల వసూళ్ల రంగానికి దీర్ఘకాలి కంగా ప్రయోజనం చేకూర్చే అంశాలపైనే ప్రతి ఒక్కరూ ప్రధానంగా దృష్టి సారించాలని నిర్మల సీతారామన్ చెప్పారు. పన్ను నిబంధనల సవరణలపై ప్రతిపాదనలు చేసేటప్పుడు పూర్తి సమాచారంతో కూడిన నివేదికలను సమర్పించాలని కోరారు. ఏదైనా నిబంధన వల్ల పన్ను చెల్లింపుదారులపై అదనపు భారం పడుతుంటే, దాని వల్ల ఎంతమంది ప్రభావితమవుతున్నారు, ఎంత సమయం, వ్యయం వృథా అవుతుందనే వివరాలను గణాంకాలతో సహా నిరూపించాలని కోరారు. దీనికి ప్రత్యామ్నాయ మార్గాలు ఏమిటో కూడా ప్రతిపాదించాలని, ఈ మార్పుల వల్ల ప్రభుత్వ ఆదాయంపై పడే ప్రభావాన్ని నిశితంగా అంచనా వేయాలని నిర్మల సీతారామన్ పేర్కొన్నారు. వీటి వల్ల ఎవరికి ప్రయోజనం కలుగుతుంది, పన్ను పరిధి ఏ మేరకు ప్రభావితమవుతుంది, పన్నుల నిర్వహణపై ఎలాంటి ఫలితాలు ఉంటాయనే విషయాన్ని సమగ్రంగా విశ్లేషించడం ఎంతైనా అవసరమని వివరించారు. కేంద్ర ప్రభుత్వం పన్ను విధానాలను సరళీకరిస్తూనే, దేశ ఆర్థిక వృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటోందని గుర్తుచేశారు. నిబంధనల మార్పు ఒక వర్గానికి మాత్రమే కాకుండా, మొత్తం ఆర్థిక రంగానికి మేలు చేసేలా ఉన్నప్పుడే నిజమైన సంస్కరణలు సాధ్యమవుతాయని అభిప్రాయపడ్డారు. పన్నుల పరిధిని విస్తృతం చేస్తూనే, విధానపరమైన అడ్డంకులను తొలగించడానికి తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు.

# యూపీఐ లావాదేవీలు కస్టమర్లకు ఉచితమే..

(మొదటి పేజీ తరువాయి)

విధానం అవసరమని చెప్పారు. ఈ విధానం వల్ల కస్టమర్లపై అదనపు భారం పడదన్నారు. ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సమీర్ నిగమ్ ఈ వివరాలు వెల్లడించారు. వ్యక్తి నుంచి వ్యక్తికి చేసే చెల్లింపులతో పాటు వ్యక్తి నుంచి వ్యాపారికి చేసే చెల్లింపులు కూడా వినియోగదారులకు ఉచితంగానే ఉంటాయని చెప్పారు. ఎండీఆర్ చెల్లించే వ్యాపారులు ఆ మొత్తాన్ని కస్టమర్లపై వేయడానికి అనుమతి ఉండదన్నారు. వార్షిక టర్నోవర్ రూ.లక్ష కంటే తక్కువగా ఉన్న చిన్న వ్యాపారులు ఎండీఆర్ పరిధిలోకి రారని నిగమ్ తెలిపారు. పెద్ద దుకాణాల్లో జరిగే లావాదేవీల్లో 96 శాతం రూ.2 వేల కంటే తక్కువ మొత్తానివేనని చెప్పారు. వీటిపై ఎలాంటి ఛార్జీ ఉండదన్నారు. రూ.2 వేలకుపైగా జరిగే లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్‌ను వ్యాపారులే చెల్లిస్తారని వివరించారు. ఈ ఎండీఆర్ ద్వారా వచ్చే ఆదాయాన్ని యూపీఐ వ్యవస్థలో పెట్టుబడులకు ఉపయోగించవచ్చని నిగమ్ తెలిపారు. యూపీఐ మౌలిక సదుపాయాలను కొనసాగించేందుకే పరిశ్రమకు ఏటా కనీసం రూ.10 వేల కోట్ల నుంచి రూ.12 వేల కోట్ల వరకు ఖర్చవుతోందన్నారు. కేవైసీ, సైబర్ భద్రత, మోసాల నివారణ, చార్జ్‌బ్యాక్‌లు, మూలధన వ్యయం వంటి వాటికీ భారీగా ఖర్చవుతుందని చెప్పారు. యూపీఐ కొత్త ఆదాయ విధానం వల్ల ఫిన్‌టెక్ సంస్థలు మార్కెటింగ్, ఆవిష్కరణలు, పరిశోధన, అభివృద్ధిపై మరింత పెట్టుబడి పెట్టే అవకాశం ఉంటుందని నిగమ్ పేర్కొన్నారు. 2020 నాటికి యూపీఐ వినియోగదారులు దాదాపు 20 కోట్ల మంది ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 50-55 కోట్లకు చేరిందని తెలిపారు.

# పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితి 25,000

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటివరకు నెలకు రూ. 15,000 ఉన్న ఈ పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితిని ఏకంగా రూ. 25,000కు పెంచుతూ కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ప్రతిపాదించిన బిల్లుకు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఈ సంచలన నిర్ణయాన్ని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియా సమావేశంలో వివరంగా వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో దేశవ్యాప్తంగా సుమారు 51 లక్షల మంది ఉద్యోగులకు నేరుగా లబ్ధి చేకూరనుందని ఆయన తెలిపారు. ఈ సామాజిక భద్రతా పథకం విస్తరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వం తరఫున రూ. 11,339 కోట్ల నిధులను ఖర్చు చేయబోతోంది. ఈ నిర్ణయం సెప్టెంబర్ 17 నుంచే అమలులోకి రానుంది. గతంలో 2004 నుంచి 2014 వరకు పీఎఫ్ వేతన పరిమితి ఎలాంటి మార్పూ లేకుండా కొనసాగింది. అనంతరం సెప్టెంబర్ 2014లో దీనిని రూ. 15,000కు పెంచారు. దాదాపు దశాబ్ద కాలం తర్వాత మళ్లీ ఇప్పుడు రూ. 25,000కు పెంచడం విశేషం. అనేక రాష్ట్రాల్లో కనీస వేతనాలు ఇప్పటికే రూ. 15,000 కంటే దాటిపోయిన నేపథ్యంలో 2014 పరిమితి కాలం చెల్లినదైందని, అందుకే సమగ్ర సంప్రదింపుల తర్వాత ఈ సీలింగ్‌ను రూ. 25 వేలకు పెంచినట్లు మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. రూ. 15,000 కంటే ఎక్కువ జీతంతో కొత్తగా ఉద్యోగంలో చేరే చాలామందికి పీఎఫ్, పెన్షన్, సంబంధిత బీమా రక్షణ లభించేది కాదు. తాజాగా వేతన సీలింగ్‌ను రూ. 25,000కి పెంచడం వల్ల రూ. 15,000 నుంచి రూ. 25,000 మధ్య సంపాదించే మధ్యతరగతి ఉద్యోగులందరూ ఇకపై చట్టబద్ధంగా ఈపీఎఫ్ పరిధిలోకి వస్తారు. ఇది ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్లను పెంచడమే కాకుండా, ప్రైవేటు సంస్థల యాజమాన్యాలకు తమ సిబ్బందికి మెరుగైన సామాజిక భద్రత కల్పించేందుకు ఉపయోగపడుతుంది.

# ఓటుకు నోటు కేసులో దర్యాప్తు వేగవంతం

**హైదరాబాద్,సెప్టెంబర్ 16 (ప్రజావినికిడి):** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 'ఓటుకు నోటు' కేసుపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఈరోజు విచారణ జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం (జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనా) విచారణ జరిపింది. తమపై నమోదైన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు చట్టపరంగా చెల్లదని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారం ముమ్మాటికీ ప్రజాప్రాతినిధ్య/ఎన్నికల నిబంధనలకు సంబంధించిందని, దీనిపై దర్యాప్తు చేసే అధికారిక పరిధి ఏసీబీకి లేదని స్పష్టం చేశారు. 2015లో కేసు నమోదైన నాటికి అమల్లో ఉన్న చట్టాలను ప్రస్తావిస్తూ... నాటి నిబంధనల ప్రకారం లంచం ఇవ్వడం/తీసుకోవడం అనే ప్రక్రియను ఎన్నికల కేసుగా చూడాలి తప్ప, అవినీతి నిరోధక చట్టం కింద నేరంగా పరిగణించలేమని న్యాయవాదులు వాదించారు. గతంలో ఈ కేసును సమగ్రంగా విచారించిన ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి పదవీ విరమణ చేయడంతో, ప్రస్తుత నూతన త్రిసభ్య ధర్మాసనం విచారణను మొదటి నుంచి చేపట్టింది. ఇరుపక్షాల ప్రాథమిక వాదనలను విన్న ధర్మాసనం, తదుపరి తుది విచారణ తేదీని త్వరలోనే సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ద్వారా ఖరారు చేయనున్నట్లు వెల్లడించింది.

# 22ఏలో నాలుగు లక్షల ఎకరాలే పట్టా భూములు

(మొదటి పేజీ తరువాయి)

మీడియాతో ఇష్టాగోష్ఠిలో మాట్లాడిన పొంగులేటి.. తన మామ భూములకు గత కాంగ్రెస్ ప్రభుత్వమే ఎన్‌ఓసీ ఇచ్చిందన్న హరీశ్‌రావు వ్యాఖ్యలపై స్పందించారు. అసైన్డ్ భూములకు అనుమతి ఇవ్వడం చట్టబద్ధం కాదని, ఏ ప్రభుత్వం అలా చేసినా తప్పేనని అన్నారు. ఆ విషయం హరీశ్‌రావుకు తెలియదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భూదాన్ భూమిని నకిలీ ఎన్‌ఓసీతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పొంగులేటి ఆరోపించారు. అది కూడా తప్పేనని అన్నారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ విషయంలోనూ నిషేధిత భూమి రిజిస్ట్రేషన్ జరిగిందని ఆరోపించారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో స్టేటస్‌కో ఉత్తర్వులు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని ఏ సర్కార్ రిజిస్ట్రేషన్ చేసినా అది తప్పేనని స్పష్టం చేశారు. 22ఏ నిషేధిత జాబితాపైనా పొంగులేటి కీలక వివరాలు వెల్లడించారు. ఈ జాబితాలో ఉన్న భూముల్లో సుమారు నాలుగు లక్షల ఎకరాలు మాత్రమే పట్టా భూములని, మిగిలిన భూమంతా ప్రభుత్వ భూమేనని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 22ఏ జాబితా నుంచి 47,440 ఎకరాలు తగ్గించినట్లు అసెంబ్లీలో ఇప్పటికే వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాలపై త్వరలోనే పూర్తి వివరాలు బయటపెడతామని పొంగులేటి తెలిపారు. 22ఏ భూముల వ్యవహారంపై ప్రభుత్వం త్వరలో కీలక నిర్ణయాలు తీసుకోనుందని చెప్పారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
గురువారం17 సెప్టెంబర్ 2026

# ఆశ్రమ పాఠశాల గురుకుల కళాశాల పై ఎమ్మెల్యే కు వినతిపత్రం

## ఎఎన్ఎస్ ఆదివాసి నవనిర్మాణ సేనా ములుగు జిల్లా అధ్యక్షులు ఎట్టి విద్యాసాగర్





**వాజేడు,సెప్టెంబర్ 17,(ప్రజావినికిడి):**
వాజేడు మండలం లో ఉన్న పెద్దగొల్లగూడెం ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత పై గురుకుల కళాశాల,గూర్చి పెనుగోల్ కాలని గ్రామం లో సమస్యలపై ఎమ్మెల్యే తెల్లం.వెంకట్రావు కి ఎఎన్ఎస్ ఆదివాసి నవనిర్మాణ సేనా నాయకులు వినతిపత్రం అందజేయడం జరిగినది ఎఎన్ఎస్ ఆదివాసి నవనిర్మాణ సేనా ములుగు జిల్లా అధ్యక్షులు ఎట్టి విద్యాసాగర్ ఎమ్మెల్యే తో మాట్లాడుతూ, ఆశ్రమ పాఠశాలల్లో ఉన్నటువంటి ఉపాధ్యాయుల కొరతను వెంటనే భర్తీ చేయాలని ఆశ్రమ పాఠశాల లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని అన్నారు.అలాగే గురుకుల కళాశాలను తిరిగి వాజేడు కు తీసుకు రావాలని అక్కడ పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అక్కడ వసతులు కరెక్టుగా లేవని ఎమ్మెల్యే తో మాట్లాడటం జరిగినది ఎమ్మెల్యే తక్షణమే స్పందించి ఆర్సిఓ తో ఐటిడిఎ,పిఎ తో మాట్లాడారు అలాగే పెనుగోలు కాలని వారికి ఇంటి పట్టాలు ఇంటి పన్నులు ఇవ్వాలని మాట్లాడటం జరిగినది.ఈ కార్యక్రమంలో పాయం అజయ్ కుమార్,తల్లాడి ప్రసాద్ తది తరులు పాల్గొన్నారు.

**ఆశ్రమ బాలికల పాఠశాలకు ఐటిడిఏ అధికారులు**
**వాజేడు, ఆదివాసీ నవ నిర్మాణ సేన నాయకులు**

వాజేడు మండలంలోని పెద్దగొల్లగూడెం ఆశ్రమ బాలికల పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై మంగళవారం ఎటీవి సోషల్ మీడియా ద్వారా వీడియో పోస్ట్ చెయ్యగా..వెంటనే ఐటిడిఏ అధికారులు స్పందించి ఆశ్రమ పాఠశాలలో ఉన్న సమస్యలు పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ ఏటూరునాగారం ఉప సంచాలకులు హామీ ఇచ్చారు.బుధవారం పాఠశాలను సందర్శించిన ఉప సంచాలకులు పాఠశాల పరిసరాలు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బందితో మాట్లాడి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయుల కొరత,తాగునీటి సదుపాయం, మరుగుదొడ్ల నిర్వహణ, పరిశుభ్రత, పాఠశాల పరిసరాల నిర్వహణ, కాపలాదారు సదుపాయం,సిబ్బంది కొరత, క్రీడా సదుపాయాలు తదితర సమస్యలను పిల్లలు ఉప సంచాలకుల దృష్టికి తీసుకెళ్లారు.ముఖ్యంగా సామాజిక శాస్త్రం, జీవశాస్త్రం, హిందీ,గణితం సబ్జెక్టులకు ఉపాధ్యాయుల కొరత ఉందని, దీనివల్ల విద్యార్థుల చదువుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని విద్యార్థినులు వివరించారు. దీనిపై స్పందించిన ఉప సంచాలకులు విద్యార్థుల విద్యకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉపాధ్యాయులను నియమించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.బాలికల ఆశ్రమ పాఠశాల కావడంతో విద్యార్థుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, పాఠశాలకు కాపలాదారు సదుపాయం కల్పించాలని కోరారు.అలాగే పరిశుభ్రమైన తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ, పాఠశాల పరిసరాల పరిశుభ్రత, తగినంత సిబ్బంది,క్రీడా సదుపాయాలు కల్పించాలని పిల్లలు విజ్ఞప్తి చేశారు.గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన,పరిశుభ్రమైన అనుకూలమైన విద్యా వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందని ఆదివాసీ నవనిర్మాణ సేన నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎస్, ఆదివాసీ నవ నిర్మాణ సేన నాయకులు జెజ్జరీ సాయిబాబు,పాయం ఆంజనేయులు, యాలం అశోక్, పీర్ల రాంబాబు,కోరం మనోజ్ కుమార్,పీర్ల రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ కలెక్టరేట్ ముందు 22ఏ పై టీటిడిపి పార్టీ ఆధ్వర్యంలో

# చలో కలెక్టరేట్ కార్యక్రమం..

**22ఏ లో ఉన్న ప్రభుత్వ భూములను పరిరక్షించండి..**

**పట్టాదారుల భూములు 22ఏ లో ఉంటే తొలగించి బాధితులకు న్యాయం చేయాలని టిడిపి ఆందోళన లో**

**పాల్గొన్న టిడిపి జాతీయ పోలిట్ బ్యూరో సభ్యులు,షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు..**




**హైదరాబాద్, (ప్రజావినికిడి):**
తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 22ఏ ప్రభుత్వ భూములు,భూదాన్ భూములు,అర్బన్ సీలింగ్ లాండ్స్,దేవాలయ భూములు వక్ఫ్ బోర్డు భూములను పరిరక్షించాల్సిన ప్రభుత్వాలు ఈ భూముల లావాదేవీలలో ఇతరులకు కొనుగోలు,బదిలీ చేయడానికి ఈ మిగులు భూములన్ని 22ఏ లో ఉంటాయి.గత బిఆర్ఎస్ అధినేత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ అయిన తర్వాత ధరణి పోర్టల్ తీసుకొచ్చి,కాలం నెంబర్ 16ను కాస్తుకాలం తీసేసి తెలంగాణ బడుగు బలహీనవర్గల ప్రజలకు సంబంధించిన భూములను కేసీఆర్ కాస్తుకాలం అనేది లేకుండా చేసి పెత్తందారులకు భూములు అప్పగించిన ఘనుడని విమర్శించారు, 1946,1951 అక్టోబర్ 21 వరకు సాయుధ పోరాటం జరిగింది రక్షిత కవులుదారు చట్టం ప్రకారం 1950 నుంచి 1956 వరకు ఎవరైతే కబ్జాలు ఉంటరో వాళ్లకు 38ఇ సర్టిఫికెట్ ఇవ్వడం ఈ భూస్వాముల నుంచి సీలింగ్ ద్వారా తీసుకున్నటువంటి భూములన్ని కబ్జాలో ఉన్నవాళ్లకి (ఆర్ఓఆర్) యాక్టివ్ ద్వారా (ఓఆర్సి) ఆక్యుపెన్సి రైట్ సర్టిఫికెట్,చట్టం కు ఉపయోగపడతాయన్నారు. దున్నేవాడిదే భూమి అంటే కాస్తుకాలం తీసేసిన తర్వాత భూస్వామి,భూములను సీలింగ్ యాక్ట్ ప్రభుత్వానికి ఇచ్చిన పేరు మాత్రం భూస్వామిదే నడుస్తుంది నువ్వు యాక్ఫెన్సీ సర్టిఫికెట్ తీసుకోవడానికి ఉపయోగపడే 16కాస్తుకాలం మనం పట్టాదారుల పట్టాను రద్దు చేసిన తర్వాత పేదల పొట్ట కొట్టడం కొరకై 38ఈ సర్టిఫికెట్ లేకుంటే భూములు రద్దు అయినాక ప్రభుత్వానికి అవి ఆభూమి యజమానికి ఎట్లాగైతే ఇనాం భూములు,ఇనాం దస్తకర్ ఇవన్నీ కూడా కాలం నెంబర్ 16లో ఈ కాలం నంబర్ 16 ఏందంటే 9వ షెడ్యూల్ లో ఉంది,9వ షెడ్యూల్లో ఉన్నదాన్ని తీసేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం లేదు అది కేవలం పార్లమెంట్ పరిధిలో ఉంటుందని,ఒకవేళ దాన్ని అమలులో పెట్టాలి అంటే రాష్ట్రపతి ఆమోదం ముద్ర పొందినటువంటి కాలం నెంబర్ 16ను నీవు తీసేయడం పరమ దుర్మార్గం ఆంధ్ర పాలకులు వచ్చి అన్ని అమ్ముకున్నారు.కొనుక్కున్నారు. నీళ్లు తాగేంద్రు,నిప్పులు చేసిర్రు,అని అన్న కెసిఆర్ మరి లక్షల ఎకరాలునీ ఇష్టం వచ్చినోళ్లకు 22ఏ సడలించి పెత్తందారులకు అమలు చేసినంక తర్వాత ఆ 22ఏ భూములను మీ కుటుంబ సభ్యులు మీ చుట్టాలు, బంధువులు అందరూ కూడా ఆయన ధరణి పోర్టల్ అడ్డుపెట్టుకొని ఎక్కువ ఉత్తర తెలంగాణలో భూస్వాముల భూములన్ని వాళ్లకు అప్పనంగా అప్పజెప్పడానికి కాస్తుకాలం తీసేసి తద్వారా కోటీశ్వరులందరు కూడా రైతు బంధు పథకం అమలు చేసి పేద బడుగు బలహీన వర్గాలను నట్టేట ముంచిన ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వమే అని మండిపడ్డారు.
ఆచార్య వినోబాభావే సాయిధ పోరాటాన్ని ప్రత్యక్షంగా తిలకించి దాన్ని మిత్రత్వంతో సమస్యల పరిష్కారం చేసుకోవాలని మూడు రోజుల పాదయాత్రలో,18 బుధవారం 1951నాడు 100 ఎకరాలు వేదిరే రామచంద్రారెడ్డి వద్ద తీసుకొని పేద ప్రజలకు పంచారన్నారు.అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారము రోజున11:9:1996 లో వినోబాభావేకు భూమి దానం ఇచ్చిన వ్యక్తుల కాంస్యవిగ్రహాలు ఏర్పాటు చేసి ధర్మకార్యాలను రాబోయే తరాలకు గుర్తుండిపోయే నెలకొల్పారన్నారు.అందుకనే నేడు టిడిపి ఆధ్వర్యంలో 33 జిల్లాలలో బుధవారం నాడే భూదానోద్యమం ప్రారంభమైన సందర్భంగా నేడు అదే బుధవారం రోజున ఈ ధరణి పోర్టల్ తీసుకువచ్చి తప్పు చేసిన కెసిఆర్ ప్రభుత్వం, అంతకుముందు రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో భూభారతి పోర్టల్ ను అమల్లో పెట్టే ప్రయత్నం జరిగిన అది కార్యరూపం దాల్చలేదన్నారు.నేడు కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి పోర్టల్ ను ప్రవేశపెట్టి వీళ్ళు కూడా పేద మధ్యతరగతి రైతులను 22ఏ ద్వారా కార్యాలయాల్లో చుట్టూ తిప్పుతూ నానుస్తున్నారు. ప్రభుత్వ భూములు,గైరాన్





భూములు,సర్కార్ భూములు, దేవాలయ భూములు,అన్ని భూములను కూడా కాపాడడంలో ప్రభుత్వాలు విఫలమయ్యారు22ఏ భూములను ఏ అధికారి పట్ట పొలాలను 22ఏ లో పెట్టిండు,
ఏ అధికారి ప్రభుత్వ భూముల యొక్క ఆర్థిక వనరులను 22ఏ నుంచి తొలగించిన అధికారి ఎవరు అదేవిధంగా ఒకవేళ కాంగ్రెస్ ఎన్వోసి ఇవ్వడంలో తప్పు చేస్తుందన్నారు.నేడు టిడిపి పార్టీ కూడా ప్రజల పక్షాన నేడు బుధవారం 33 కలెక్టర్ కార్యాలయాలలో ప్రజల పక్షాన 22ఏ పట్టా భూములు ఉంటే తొలగించండి,ప్రభుత్వ భూములను పరిరక్షించాలని,బుధవారం నాడు తెలుగుదేశం పార్టీ అధిష్టాన వర్గం ఆదేశానుసారం మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించి కలెక్టర్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగినది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి జాతీయ పోలీట్ బ్యూరో సభ్యులు,షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు,పొలిట్ బ్యూరో సభ్యులు అరవింద్ కుమార్ గౌడ్,మల్కాజ్గిరి పార్లమెంట్ కన్వీనర్ కందికంటి అశోక్ కుమార్ గౌడ్ మరియు పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గల ముఖ్య నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన చేపట్టి కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు.

# కొలన్ సులోచన మృతికి మైనాంపల్లి హన్మంత్ రావు సంతాపం



**కుత్బుల్లాపూర్,(ప్రజావినికిడి):**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి మాతృమూర్తి, కీ.శే.కొలన్ సులోచన ఈ నెల 9 వ తేదీన అకాల మరణం చెందడంతో, ఆయన నివాసానికి పలువురు ప్రముఖులు విచ్చేసి సంతాపం తెలిపారు.ఈ సందర్భంగా మల్కాజగిరి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే మైనాంపల్లి హన్మంత్ రావు కొలన్ హన్మంత్ రెడ్డి ని పరామర్శించి, సులోచనమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.సులోచన మృతి పట్ల వారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ,వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమం లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు కాలనీలలో ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు కుంట సిద్ధి రాములు



**కుత్బుల్లాపూర్,(ప్రజావినికిడి):**
287 పేట్ బషీరాబాద్ అంబేద్కర్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజ కార్యక్రమాలలో పాల్గొన్న కుంట సిద్ధిరాములు.. అనంతరం ప్రెసిడెంట్ వినీత్ ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముత్యాలమ్మ ఆలయం చైర్మన్ టి.రాజేశ్వర్. బ్యాంకు కాలనీ ప్రెసిడెంట్ గంధం సుధాకర్ గౌడ్ తో కలసి అనిల్ గౌడ్ ఏరుపాటు చేసిన గణేష్ మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుంట మీనాక్షి కాలనీ లో గణేష్ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. జీడిమెట్ల ఆటో డ్రైవర్లు వెంకటేష్ వారి మిత్రబృందం ఆధ్వర్యంలో అదేవిధంగా వెన్నెలగడ్డ నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం ఏర్పాటు చేసిన గణేష్ వేడుకల్లో పాల్గొని గణేష్ మండపం వద్ద నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో బచ్చ జ్ఞానేశ్వర్, పోగు సమ్మయ నేత,అనిల్ గౌడ్, మస్కూరి పద్మ, విజయ,కృష్ణవేణి కవిత కాలని పెద్దలు మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రెవెన్యూ కార్యాలయాలకు సొంత భవనాలు మంజూరు చేయాలి

## నూతనంగా ఏర్పడ్డ మండలాల్లో మౌలిక వసతులు కల్పించాలి: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
22-ఏ నిషేధిత భూముల అంశంపై అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా షాద్ నగర్ ఎమ్మెల్యే,ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ రెవెన్యూ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు.గత ప్రభుత్వ హయాంలో పరిపాలనా సౌలభ్యం కోసం కొత్త మండలాలను ఏర్పాటు చేసినప్పటికీ,అనేక మండలాల్లో ఇప్పటికీ రెవెన్యూ కార్యాలయాలకు సొంత భవనాలు లేక అధికారులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు.కొత్తగా ఏర్పడిన మండలాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రత్యేకంగా జిల్లేడు చౌదరిగూడ మండలంలో తహసీల్దార్ కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,అక్కడ తహసీల్దార్ కార్యాలయానికి నూతన భవనం మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఫరూఖ్ నగర్ తహశీల్దార్ కార్యాలయ భవనం కూడా శిథిలావస్థకు చేరిందని నూతన భవనం మంజూరు చేయాలని కోరారు.అలాగే లింగారెడ్డిగూడ గ్రామంలో సెరికల్చర్ డిపార్ట్మెంట్‌కు చెందిన భవనంలో కొనసాగుతున్న రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) కార్యాలయానికి కూడా సొంత భవనం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.షాద్ నగర్ నియోజక వర్గం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి పెద్ద ఎత్తున రెవెన్యూ వస్తుందని తెలిపారు. ఇప్పటికే నందిగామ తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.2.25 కోట్ల నిధులు మంజూరు కావడం పట్ల ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు.

# జల సంరక్షణ 'రంగ' సేవలకు గుర్తింపు

## -ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డుకు షార్ట్స్ లిస్ట్



**ఆబిడ్స్, (ప్రజావినికిడి):**
పర్యావరణ పరిరక్షణ,వర్షపు నీటి సంరక్షణ రంగాల్లో విశేష కృషి చేస్తున్న హైదరాబాద్ కు చెందిన పర్యావరణ వేత్త, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ నిపుణుడు రంగ ప్రసాద్ ప్రతిష్ఠాత్మక ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డుకు షార్ట్ లిస్ట్ అయ్యారు. సస్టెయిన బిలిటీ విభాగంలో మరి కొంత మందితో పాటు ఆయనను ఎంపిక చేశారు. ఈ నెల 9వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఓటింగ్ నిర్వహించి ఎక్కువ ఓట్లు లభించిన వారికి అవార్డును బహూకరిస్తారు. రంగ ప్రసాద్ 2009 నుంచి పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అంశాలపై పనిచేస్తున్నారు. 2016 నుంచి హైదరాబాద్ లో వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఆయన నిర్వహిస్తున్న "హైదరాబాద్ రేన్ హార్వెస్ట్' సంస్థ ద్వారా నగరంలోని వివిధ ప్రాంతాల్లో వందలాది వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల రీచార్జ్ (వాటర్ హార్వెస్టింగ్ పిట్స్) నిర్మాణాలను చేపట్టారు.కొత్తగా రీచార్జ్ పిట్స్ నిర్మించడమే కాకుండా, నిర్లక్ష్యానికి గురైన పాత హార్వెస్టింగ్ పిట్స్ ను గుర్తించి వాటిని పునరుద్ధరించడం, నిర్వహించడం వంటి కార్యక్రమాలను కూడా ఆయన చేపట్టారు. ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డుకు రంగ ప్రసాద్ షార్ట్ లిస్ట్ కావడం పర్యావరణ పరిరక్షణ,సుస్థిర నీటి నిర్వహణ కోసం హైదరాబాద్ లో కొనసాగుతున్న ప్రయత్నాలకు గుర్తింపుగా భావిస్తున్నారు. ఈ లింక్ **https://prideoftelangana.com/vote.php** ను ఉపయోగించి ఆయనకు ఓటు వేసి అవార్డు పొందడానికి సహకరించాలని పలువురు పర్యావరణవేత్తలు అభిలాషించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



## అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా హైకోర్టు న్యాయ ప్రముఖులకు సన్మానం



**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):** న్యాయాన్ని ప్రోత్సహించడానికి బాధితుల హక్కులను కాపాడటానికి కృషికి మద్దతుగా సెప్టెంబర్ 17న అంతర్జాతీయ న్యాయ దినోత్సవం జరుపుకుంటామని తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ అన్నారు. బుధవారం మదీనా సమీపానగల తెలంగాణ హైకోర్టు ప్రాంగణంలో అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించారు. ఒక అమాయకుడికి కూడా అన్యాయం జరగకూడదు అన్న సూత్రం న్యాయవ్యవస్థకు నాంది అని అన్నారు.

ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు గవర్నమెంట్ ప్లీడర్ ప్రముఖ న్యాయవాది ఎస్ ఎల్ శ్రీనివాసులు గౌడ్ మాట్లాడుతూ, ప్రస్తుత రోజుల్లో న్యాయవ్యవస్థ సామాన్యుడికి న్యాయం కలిగేలా పలుచట్టాలను అందుబాటులోకి తెచ్చిందని అయితే శిక్షారతకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగించడం మారణ హోమంలో బాధితులకు న్యాయం చేయడం వంటి ప్రాముఖ్యత ఈరోజు సూచిస్తుందని అన్నారు. అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఇండియా అడ్వకేట్స్ అధ్యక్షులు, హైకోర్టు గవర్నమెంట్ లీడర్ సి ఎస్ సుమన్ మాట్లాడుతూ, న్యాయం పై ప్రజలలో అవగాహన కల్పించి ఐక్యంగా న్యాయం కోసం పోరాడేలా చేయడం అలాగే బాధితులను హక్కులను కోసం పోరాడేలా చేయడం కోసం ఎంచుకున్నారని వివరించారు. ఈ సందర్భంగా గత 30 సంవత్సరాలుగా నిరంతరం ప్రజల హక్కులపై ప్రజలను జాగృతి పరుస్తున్న తెలంగాణ హైకోర్టు ప్రభుత్వ ప్లీడర్ ప్రముఖ న్యాయవాది శ్రీ ఎస్ ఎల్ శ్రీనివాసులు గౌడ్ కు అదేవిదంగా 21 సంవత్సరాలుగా నిరంతరం ప్రజలను వారి హక్కుల పట్ల చైతన్యవంతం చేస్తున్న తెలంగాణ హైకోర్టు పబ్లిక్ ప్లీడర్ యస్ సుమన్ కు మరియు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి. విజయ కుమారి లకు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా హైకోర్టు ప్రముఖ న్యాయవాదులుసిహెచ్ సాంసంగ్ బాబు,ప్రముఖ న్యాయవాది మహమ్మద్ అక్తర్ షరీఫ్,సివి నరసింహుడు సంస్థ కోఆర్డినేటర్ జి వేణుగోపాల్ తదితరులు పాల్గొని ఎస్ఎల్ శ్రీనివాసులు గౌడ్ సుమన్ కు అభినందనలు తెలిపారు.

# అంతర్జాతీయ స్థాయి సౌందర్య సేవలను ఒకే చోట అందుబాటులోకి

### టాలీవుడ్ ప్రముఖ కొరియోగ్రాఫర్ అనీ మాస్టర్
### ఉప్పల్ భగయత్ లో హెచ్ఎన్ఎస్ లుక్స్' హెయిర్ స్కిన్ లాంజ్ ప్రారంభించిన అనీ మాస్టర్

**ఉప్పల్,సెప్టెంబర్ 16, (ప్రజావినికిడి):**
ఉప్పల్ భగాయత్ పరిధిలో సరికొత్తగా ఏర్పాటు చేసిన 'హెచ్ఎన్ఎస్ లుక్స్' హెయిర్ & స్కిన్ లాంజ్ బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి టాలీవుడ్ ప్రముఖ కొరియోగ్రాఫర్ అనీ మాస్టర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి,జ్యోతి ప్రజ్వలన చేసి లాంజ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేసి నిర్వాహకులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి అనీ మాస్టర్ మాట్లాడుతూ, ఉప్పల్ భగాయత్ పరిసర ప్రాంత ప్రజలకు అంతర్జాతీయ స్థాయి సౌందర్య సేవలను ఒకే చోట అందుబాటులోకి తీసుకురావడం చాలా సంతోషకరమని పేర్కొన్నారు.నేటి ఆధునిక జీవనశైలిలో కేశాలంకరణ, చర్మ సంరక్షణ ప్రతి ఒక్కరికీ దైనందిన జీవితంలో భాగమైపోయాయని, మహిళా పారిశ్రామికవేత్తలుగా సరికొత్త అడుగులు వేస్తున్న నిర్వాహకులు హారిక అలాగే శిరీషలకు తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అధునాతన పరికరాలు, సుశిక్షితులైన సిబ్బందితో ఏర్పాటైన ఈ హెచ్ఎన్ఎస్ లక్స్ లాంజ్ ప్రజల ఆదరాభిమానాలను చూరగొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆమె మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. అనంతరం నిర్వాహకులు హారిక,శిరీషలు మాట్లాడుతూ, మహిళలతో పాటు పురుషులకు కూడా తల వెంట్రుకల నుంచి పాదాల వరకు అవసరమైన అన్ని రకాల



హెయిర్,స్కిన్, బ్యూటీ,నెయిల్స్ మరియు లగ్జరీ ట్రీట్మెంట్స్ అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. నాణ్యమైన అంతర్జాతీయ బ్రాండెడ్ ఉత్పత్తులను మాత్రమే వినియోగిస్తున్నామని,దాదాపు 20 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం కలిగిన నిపుణులైన సిబ్బందితో అత్యుత్తమ సేవలు అందిస్తున్నామని వివరించారు. ఇతర క్లినిక్‌లతో పోలిస్తే సామాన్యులకు సైతం అందుబాటులో ఉండే రీజనబుల్ ధరలకే సేవలందిస్తున్నామని, ప్రారంభోత్సవం సందర్భంగా కేవలం రూ. 499/- నుంచే కాంబో ప్యాకేజీలు, అలాగే రూ. 2,000/- నుంచే అడ్వాన్స్‌డ్ స్కిన్ ట్రీట్మెంట్స్ ప్రారంభమవుతున్నాయని తెలిపారు. ఈ లాంజ్ ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందని, సేవల కొరకు 9381699033 నంబర్‌ను సంప్రదించవచ్చని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్థానిక మహిళలు పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

## షాద్ నగర్ పట్టణంలో వినాయక మండపాలలో పూజా, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాల లో హాజరైన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**షాద్ నగర్ పట్టణంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో,వైభవంగా సాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని టీచర్స్ కాలనిలో కంటెస్టెడ్ కౌన్సిలర్ రాజేందర్ సింగ్,విజయ్ నగర్ కాలనీ లో భక్తులు ఏర్పాటు చేసిన పూజా అలాగే అన్నవితరణ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ రెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా ఆయా మండపాల వద్ద స్వామివారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించి అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ (అన్నదానం) కార్యక్రమాలను ఆయన ప్రారంభించి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. అనంతరం నవీన్ రెడ్డి మాట్లాడుతూ, విఘ్నేశ్వరుని తోడుతో సమాజానికి, ప్రజలందరికీ ఉన్న సర్వ విఘ్నాలు దూరం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అనితా రఘునాథ్ యాదవ్,ఎస్పీ శివ,మాజీ పిసిఎస్ చైర్మన్ జగదీశ్ గౌడ్,మాజీ కౌన్సిలర్లు చింటూ ప్రతాప్ రెడ్డి,కానుగు అనంతయ్య,ఈశ్వర్ రాజు,చెట్ల నర్సిమ,పాలమకుల చెన్నయ్య,చిన్న యాదగిరి కంటెస్టెడ్ కౌన్సిలర్లు నక్కల వెంకటేష్ గౌడ్,రాజేందర్ సింగ్, మాజీ సర్పంచులు చక్కటి వెంకటేష్ యాదవ్,యారం శేఖర్ రెడ్డి,నాయకులు చక్రం రెడ్డి,శ్రీకాంత్ గౌడ్,మనోహర్ రెడ్డి,అల్లాడ శేఖర్,సంజీవ రెడ్డి,సాయి తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాల నేపథ్యంలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



**సికింద్రాబాద్, (ప్రజావినికిడి):**చిలకలగూడ పోలీస్ స్టేషన్ ఏసీపీ కె.శశాంక్ రెడ్డి సమక్షంలో, లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లను స్టేషన్‌కు పిలిపించి, రాబోయే గణేష్ ఉత్సవాల సందర్భంగా కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రౌడీ షీటర్లకు మంచి ప్రవర్తనతో ఉండాలని, అప్రమత్తంగా వ్యవహరించాలని,ఉత్సవాల సమయంలో ఎటువంటి అసాంఘిక లేదా నేర కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు. అలాగే గణేష్ చందా లేదా గణేష్ ఉత్సవాల పేరుతో ప్రజల నుంచి డబ్బులు వసూలు చేయరాదని ప్రత్యేకంగా హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించ రాదని, శాంతిభద్రతలకు భంగం కలిగించకుండా, ఎటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడకుండా ఉండాలని సూచించారు. పై సూచనలు, ఆదేశాలను ఉల్లంఘించిన పక్షంలో కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని స్పష్టంగా హెచ్చరించారు.

## గణేష్ నవరాత్రుల వేడుకల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్






**నాగోల్,(ప్రజావినికిడి):**
నాగోల్ డివిజన్ పరిధిలోని లక్ష్మీ నరసింహ కాలనీ అలాగే నాగోల్ విలేజ్ ప్రాంతాల్లో గణేష్ నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక మండపాలను నాగోల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన శ్రీ గణేశుడిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తుల కోసం నిర్వహించిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని భక్తులతో కలిసి ప్రసాదాన్ని స్వీకరించారు. గణేష్ నవరాత్రుల సందర్భంగా భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలను నిర్వహిస్తున్న నిర్వాహక కమిటీ సభ్యులను అభినందిస్తూ, ప్రతి ఒక్కరూ భక్తి,ఐక్యత, సోదరభావంతో పండుగను ప్రశాంతంగా, ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. అలాగే వినాయక మండపాల వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు, పరిశుభ్రత, తాగునీరు తదితర సౌకర్యాలపై నిర్వాహకులతో చర్చించారు. గణేష్ నవరాత్రులు ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు,శ్రేయస్సును ప్రసాదించాలని శ్రీ గణేశుడిని ప్రార్థించారు.

## బ్రహ్మణపల్లికి మార్చిన తిరుపతి సిమెంట్ బ్రిక్స్



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**తొర్రుర్ రాందాస్ పల్లి లో గల తిరుపతి సిమెంట్ బ్రిక్స్ టెడ్రింగ్ ను 274 బ్రహ్మణపల్లి తుర్కయాంజల్ కు మార్చబడ్డదని ప్రోపేటర్ కుర్ర తిరుపతి అన్నారు. వినియోగదారులు గ్రహించి కొత్తగా ఏర్పాటు చేసిన బ్రిక్స్ ట్రేడింగ్ కు రావాలని కోరారు.గత మూడు సంవత్సరాల నుంచి వినియోగదారులకు మంచి సేవలు అందిస్తూ ముందుకు పోతున్న తమ ట్రేడింగ్ ను అందరూ ఆదరించాలని కుర్ర తిరుపతి పేర్కొన్నారు. వినియోగదారులకు మంచి సరసమైన ధరల్లో సేవలు అందించడం జరుగుతుందన్నారు.

## తెలంగాణ రైతాంగ సాయిధ పోరాట వార్షికోత్సవాల ముగింపు సభ

### రాష్ట్రవ్యాప్తంగా తరలి,రావాలి -సిపిఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు ఎండి పై మీద

**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
నేడు జరగబోయే 17 సెప్టెంబర్ విలీన దినాన్ని సిపిఐ పార్టీ నిర్వహిస్తున్న కార్యక్రమం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో11:30 కు గంటలకు, ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు రాష్ట్ర నాయకులు పాల్గొంటారు. కాబట్టి,కార్యక్రమానికి పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా తరలి,రావాలనిసిపిఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు ఎండి పై మీద భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం నిజాం అరాచకానికి వ్యతిరేకంగా మట్టి మనుషులు కొనసాగించిన సుదీర్ఘ రైతాంగ,సాయుధ పోరాటంలో 4500 మంది అమరులైన తెలంగాణ గడ్డపై రజాకార్ల అంతం కోసం బండి ఎనక బండ్లు కట్టి,16 పండ్లు కట్టి ఏ బండ్లో పోతావ్ కొడుకా నిజాం సర్కరోడా అని పాటలతో పోరాటాలతో వీరుల రక్తంతో



ఎర్రబారిన తెలంగాణ గడ్డ సెప్టెంబర్11 నుండి 17 వరకు అనేక సాయుధ పోరాట రైతాంగ త్యాగాలను స్మరించుకుంటూ అనేక కార్యక్రమాలు నిర్వహించుకొని ముగింపు సభ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో నిర్వహిస్తున్న కార్యక్రమం నాటికి నిజమైన స్వాతంత్రం హైదరాబాద్ విలీనం ఎంతో మంది త్యాగాలు సాయుధ పోరాటం పాఠ్యాంశ పుస్తకాలలో అట్లాగే ప్రభుత్వ ఆధీనంలో నిర్వహించాలని సాయుధ పోరాటంలో పాల్గొన్న వారికి ఒక ప్రత్యేకమైన గుర్తింపు అట్లాగే వారిని స్మరించుకుంటూ వారి త్యాగాలను రాబోయే భవిష్యత్ వారికి తెలిసే విధంగా తెలంగాణ సాయుధ పోరాటం స్ఫూర్తి దాయకంగా అమూర వీరులకు స్తూపం ఏర్పాటు చేసి సాయుధ పోరాటం చరిత్రను తెలిసే విధంగా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని అట్లాగే 17, తేదీ,రోజు,జరగబోయే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు

# గణేష్ మండపాల వద్ద డ్రగ్స్‌పై అవగాహన సదస్సు






**నాగోల్,(ప్రజావినికిడి):**
నాగోల్ లో గణేష్ ఉత్సవాలను పురస్కరించుకుని మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో సీపీ బి.సుమతి ఐపీఎస్ చేపట్టిన 'గణేష్ సురక్ష సంకల్ప్2026' కార్యక్రమంలో భాగంగా గణేష్ మండపాల వద్ద డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారుఇందులో భాగంగా నాగోల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మక్బూల్ జానీ ఆధ్వర్యంలో బ్లైండ్స్ కాలనీ సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ (ఎస్‌హెచ్‌జీ) మహిళలతో కలిసి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల ఆరోగ్యంతో పాటు కుటుంబ, సామాజిక జీవితంపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు పడే అవకాశం ఉందని ప్రజలకు వివరించారు.
ఈ కార్యక్రమంలో ఎల్‌బీ నగర్ ట్రాఫిక్ డీసీపీ వి. శ్రీనివాసులు, టీఎస్ న్యాబ్ ఈగల్ టీమ్స్ డీఎస్పీ శ్రీనివాస్, నాగోల్ ఎస్ఐ ఉమాతో పాటు ఎస్‌హెచ్‌జీ సభ్యులు ఉమా, పుష్ప,కవిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాల బారిన పడకుండా తల్లిదండ్రులు, విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ నిర్మూలనలో పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.

# సంగారెడ్డిలో గణేశ్ నిమజ్జనం వేళ ఆరుగురు విద్యార్థుల మృతి..

**సంగారెడ్డి జిల్లాలో గణేశ్ నిమజ్జనంలో ఘోర విషాదం**

**చెరువులో మునిగి ఆరుగురు విద్యార్థులు దుర్మరణం**

**మృతులంతా శిరీష అనాథాశ్రమానికి చెందినవారే**

**మృతదేహాలను పరిశీలించి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సంతాపం**

**పటాన్‌చెరులో అలుముకున్న విషాద ఛాయలు**



వినాయక నిమజ్జన వేడుకల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలోని పెదకంజర్ల గ్రామ శివారులో ఉన్న నేరేడు చెరువులో మునిగి ఆరుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో పండుగ వాతావరణం ఒక్కసారిగా విషాదమయమైంది. మృతులంతా శిరీష అనాథాశ్రమానికి చెందిన విద్యార్థులుగా గుర్తించారు.
శిరీష అనాథాశ్రమానికి చెందిన విద్యార్థులు గణేశ్ విగ్రహ నిమజ్జనం కోసం నేరేడు చెరువు వద్దకు వెళ్లారు. నిమజ్జనం చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు వారు ఒకరి తర్వాత ఒకరు నీటిలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న పటాన్‌చెరు పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గజ ఈతగాళ్ల సహాయంతో గాలించి విద్యార్థుల మృతదేహాలను వెలికితీశారు.
మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆసుపత్రికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. అనాథాశ్రమ నిర్వాహకులను పరామర్శించిన ఆయన, ఈ ఘటనపై తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మృతులను నర్సింహ రాజు, సుమంత్ (డిప్లొమా), గణేశ్ (డిప్లొమా), ఉదయ్ కిరణ్ (డిప్లొమా), శ్యామ్ కుమార్ (డిప్లొమా), సిద్ధార్థ్ (10వ తరగతి)గా గుర్తించారు. ఈ హృదయవిదారక ఘటనతో స్థానికంగా తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

**రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి**

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు, పెద్దకంజర్ల గ్రామంలో వినాయక నిమజ్జనానికి వెళ్లిన ఆరుగురు విద్యార్థులు మృతి చెందడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి ఆదేశించారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా అన్ని చోట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# విద్యుత్ శాఖలో ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట

**కారుణ్య నియామకాల ద్వారా 389 మందికి ఉద్యోగాలు**

**నేడు 25 మందికి ఏపీసీపీడీసీఎల్ లో ఉద్యోగ నియామకాలు**

**-రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి శ్రీ గొట్టిపాటి రవికుమార్**



**విజయవాడ, సెప్టెంబర్ 16 (ప్రజావినికిడి):**
రాష్ట్రంలో విద్యుత్ శాఖ ఉద్యోగుల సంక్షేమం, యువతకు ఉద్యోగ అవకాశాలు, విద్యుత్ రంగంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి శ్రీ గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. స్థానిక గుణదలలోని ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ల్లో కారుణ్య నియామక ఉత్తర్వులు అందించే ప్రదాన కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పాల్గొని మాట్లాడుతూ.. విద్యుత్ శాఖలో చేపడుతున్న వివిధ ఉద్యోగ, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కారుణ్య నియామకాల ద్వారా 389 మందికి ఉద్యోగాలు కారుణ్య నియామకాల కింద తాజాగా 25 మంది ఉద్యోగార్థులకు ఉద్యోగ నియామక పత్రాలను మంత్రి అందజేశామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రాన్స్ కో, జెన్కో, సీపీడీసీఎల్, ఈపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ సంస్థల్లో ఇప్పటివరకు మొత్తం 389 మందికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. మరణించిన విద్యుత్ శాఖ ఉద్యోగుల కుటుంబాల్లో వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ఉద్యోగి పిల్లలు చిన్న వయస్సులో ఉన్నా, అర్హత కలిగిన వయస్సుకు వచ్చినా వారు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హులైన మరో 35 నుంచి 45 మందికి కట్‌ఆఫ్ తేదీని నిర్ణయించి ప్రత్యేకంగా పరిగణించి వారికి ఉద్యోగాలు కల్పించేందుకు అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. 629 ఏఈ పోస్టుల భర్తీకి పరీక్షలు నిర్వహించాం త్వరలో ఫలితాలు అందిస్తామని, విద్యుత్ శాఖలోని అన్ని విభాగాలను కలిపి 629 అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఇ) పోస్టుల భర్తీకి పరీక్షలు నిర్వహించామని మంత్రి తెలిపారు.త్వరలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేసి, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా నియామక ప్రక్రియను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు విద్యుత్ శాఖ ఉద్యోగులకు మూడు డిఏ లు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ఎలక్ట్రిసిటీ విభాగం పనిచేస్తోందన్నారు. విద్యుత్ శాఖ ఉద్యోగులకు మెరుగైన శిక్షణ అందించేందుకు విశాఖపట్నంలో దాదాపు రూ. 30 కోట్ల వ్యయంతో ప్రత్యేక ట్రైనింగ్ సెంటర్‌ను నిర్మించామని మంత్రి తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఉద్యోగులకు నాణ్యమైన శిక్షణ అందించడమే దీని ఉద్దేశమన్నారు.


# లక్ష్యాలు చేరకపోతే ఈ సమావేశాలెందుకు?

## : ఎస్‌ఎల్‌బీసీ సమావేశంలో చంద్రబాబు




**విజయవాడ, సెప్టెంబర్ 16(ప్రజావినికిడి):**రాష్ట్రంలోని అన్ని రంగాలను, వర్గాలను బలోపేతం చేసేలా రుణాలను అందించాలని, లక్ష్యాలను చేరుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బ్యాంకర్లకు పిలుపునిచ్చారు. అమరావతిలో బుధవారం జరిగిన 236వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్-ఎల్‌బీసీ) సమావేశంలో ఆయన పాల్గొని, వివిధ అంశాలపై అధికారులకు, బ్యాంకర్లకు కీలక దిశానిర్దేశం చేశారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోలేనప్పుడు ఇలాంటి సమావేశాలు నిర్వహించి ప్రయోజనం ఏముంటుందని ఆయన సూటిగా ప్రశ్నించారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్‌ఎంఈ) రుణాల మొత్తం గతంతో పోలిస్తే పెరిగినప్పటికీ, ఆశించిన స్థాయిలో మంజూరు జరగలేదు. కొన్ని బ్యాంకులు ఇంకా వెనుకబడే ఉన్నాయి. ఈ పరిస్థితి మారాలి" అని అన్నారు. పీఎం సూర్యఘర్ పథకంలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యం ఉందని, ఇందుకు బ్యాంకులు పెద్దఎత్తున రుణాలు అందించి సహకరించాలని కోరారు.స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలు రుణాల చెల్లింపులో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని చంద్రబాబు ప్రశంసించారు. "రుణాలు తీసుకున్న వారిలో 99 శాతానికి పైగా మహిళలు సకాలంలో తిరిగి చెల్లిస్తున్నారు. ఈ విషయంలో ఏపీ ఎస్‌హెచ్‌జీ మహిళలు దేశంలోనే నంబర్-1 స్థానంలో నిలిచారు. కేవలం 0.67 శాతం మంది మాత్రమే చెల్లింపుల్లో విఫలమవుతున్నారు. వీరి నుంచి బకాయిలు వసూలు చేసేందుకు 'వన్ టైమ్ సెటిల్‌మెంట్' (ఓటీఎస్) విధానంపై ఆలోచించాలని బ్యాంకులకు సూచిస్తున్నాను" అని వివరించారు.రాష్ట్రంలో 15 శాతం ఆర్థిక వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అయితే ఎల్‌నినో కారణంగా కొంత ఇబ్బందికర పరిస్థితి తలెత్తిందని చంద్రబాబు తెలిపారు. ఈ ప్రతికూలతలను అధిగమించి ముందుకు సాగుతామని ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా, రాష్ట్ర వ్యవసాయ రంగంలో కీలకమైన కౌలు రైతులకు రుణాలు సమృద్ధిగా అందించేందుకు బ్యాంకులు చొరవ చూపాలని ఆయన కోరారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పలు సమస్యలపై వినతి పత్రం అందజేత




**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
గతంలో సుధీర్ రెడ్డి ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని 118 జీవో అదేవిదంగా ఇతర సమస్యల గురించి గౌరవ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి చర్చించడం జరిగింది.దానికి వారు అప్పుడు సానుకూలంగా స్పందించి తప్పకుండా పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది.

# సెప్టెంబర్ 17 వేడుకలు: కేంద్ర ఉత్సవాలకు ఉపరాష్ట్రపతి.. రాష్ట్ర కార్యక్రమానికి రేవంత్ రెడ్డి

హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకలకు ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. సెప్టెంబర్ 17న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే కేంద్ర ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి, సీఏపీఎఫ్ బలగాల పరేడ్‌ను పరిశీలించనున్నారు. గత కొన్నేళ్లుగా సెప్టెంబర్ 17న హైదరాబాద్‌లో కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఈ వేడుకలు నిర్వహిస్తోంది. తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రులు గజేంద్రసింగ్ షెకావత్, జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ తదితరులు కార్యక్రమానికి హాజరుకానున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు.
ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను 'తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహిస్తోంది. హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లో జరిగే రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. 32 జిల్లాల కేంద్రాల్లో మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ప్రజాప్రతినిధులు జెండా ఎగురవేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించనున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పట్టణ స్థానిక సంస్థలు, గ్రామపంచాయతీల్లోనూ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైంది. ఈ రోజును ఏ పేరుతో నిర్వహించాలన్న దానిపై తెలంగాణలో కొన్నేళ్లుగా రాజకీయ భేదాభిప్రాయాలు ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం 2022, 2023లో 'జాతీయ సమైక్యతా దినోత్సవం'గా నిర్వహించగా.. కాంగ్రెస్ ప్రభుత్వం 2024 నుంచి 'ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వం మాత్రం 'హైదరాబాద్ విమోచన దినోత్సవం'గా వేడుకలు నిర్వహిస్తోంది.

# హైదరాబాద్‌లో భూగర్భ జలాల డేంజర్ బెల్స్..

## భాగ్యనగరంలో నీటి కష్టాలు తప్పవా?




వర్షాకాలం ముగింపు దశకు చేరుకున్నా గ్రేటర్ హైదరాబాద్ వాసులను భూగర్భ జలాల సమస్య తీవ్రంగా వేధిస్తోంది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం, మరోవైపు నీటి వినియోగం భారీగా పెరగడంతో భూగర్భ జలాలు అట్టడుగు స్థాయికి పడిపోయాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఆగస్టు నాటికి సగటు భూగర్భ జలమట్టం ఏకంగా 4.84 మీటర్లు పడిపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.
భూగర్భ జలవనరుల శాఖ విశ్లేషణ ప్రకారం.. ఆగస్టు చివరి నాటికి గ్రేటర్ పరిధిలో సాధారణంగా 460 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 360 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. ఇది సాధారణం కంటే 22 శాతం తక్కువ. వర్షపాతం లోటు కారణంగా నగరవాసులు తాగునీరు, ఇతర అవసరాల కోసం బోర్లపై ఎక్కువగా ఆధారపడ్డారు.
ఈ రెట్టింపు ప్రభావంతో భూగర్భ జలాలు శరవేగంగా అడుగంటిపోయాయి. గతేడాది ఆగస్టులో సగటున 6.36 మీటర్ల లోతులో లభ్యమైన భూగర్భ జలాలు, ప్రస్తుతం 11.20 మీటర్ల లోతుకు పడిపోయాయి. నగరంలోని చాలా ప్రాంతాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది.
ముఖ్యంగా కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, అమీర్‌పేట్, బాచుపల్లి, శేరిలింగంపల్లి, దుండిగల్, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ వంటి కీలక మండలాల్లో భూగర్భ జలాలు 15 నుంచి 20 మీటర్ల కంటే ఎక్కువ లోతుకు చేరాయి. అత్యంత దారుణంగా కుత్బుల్లాపూర్ మండలంలో నీటిమట్టాలు 39 మీటర్లకు పైగా లోతుకు పడిపోవడం గమనార్హం.
గ్రేటర్ పరిధిలోని మొత్తం 73 శాతం ప్రాంతంలో భూగర్భ జలాలు 10 మీటర్ల కంటే దిగువన ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నెలలో భారీ వర్షాలు కురిసి, భూగర్భ జలాలు తిరిగి పుంజుకుంటేనే కొంత ఉపశమనం లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు. లేనిపక్షంలో రానున్న వేసవిలో భాగ్యనగరవాసులు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరిస్తున్నారు. సెప్టెంబర్ వర్షపాతమే హైదరాబాద్ భవిష్యత్ నీటి భద్రతను నిర్ధారిస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ప్రపంచ దేశాలు చొరవ తీసుకోవాలి

**సెప్టెంబర్ 16(ప్రజావినికిడి):** ప్రపంచవ్యాప్తంగా నేడు జరుగుతున్న యుద్ధాలపై ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఈ యుద్ధాలవల్ల ప్రపంచం మొత్తం ఆర్థిక సంక్షోభం లోకి నెట్టింది. నేడు పలు దేశాల మధ్య యుద్ధాల వల్ల అన్ని దేశాలలో నిత్యావసర ధరలు ఎగిసిపడుతున్నాయి. వాస్తవానికి యుద్ధాలు మానవాళికి అపారమైన నష్టాన్ని మిగిల్చాయి. మొదటి ప్రపంచ యుద్ధంలో కోట్లాది మంది సైనికులు, ప్రజలు మరణించారు. రెండో ప్రపంచ యుద్ధంలో అణుశక్తి, సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో మరింత భయంకరమైన విధ్వంసం జరిగింది. దాదాపు ఎనిమిది కోట్ల మంది ప్రాణ నష్టం, లక్షల కోట్ల ధన నష్టం జరిగింది. దేశాల ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలాయి. అయినా, ప్రపంచానికి శాశ్వత శాంతి లభించలేదు. లీగ్ ఆఫ్ నేషన్స్, ఐక్యరాజ్యసమితి, భద్రతా మండలి వంటి సంస్థలు ఏర్పడినా ప్రపంచంలో యుద్ధాలు ఆగలేదు. సామ్రాజ్యవాదం, ఆర్థిక ఆధిపత్యం, మతపరమైన విద్వేషాలు, పరోక్ష యుద్ధాలు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. రెండు ప్రపంచ యుద్ధాల అనంతరం కొరియా, వియత్నాం యుద్ధాలు కూడా లక్షలాది ప్రాణాలను బలి తీసుకున్నాయి. పాలస్తీనా--ఇజ్రాయెల్ ఘర్షణలు, ఉక్రెయిన్ యుద్ధం వంటి సంఘటనలు ప్రపంచాన్ని అశాంతి వైపు నెడుతున్నాయి. గతం నుంచి పాఠాలు నేర్చుకోవడంలో మానవజాతి విఫలమవుతోంది. కళింగ యుద్ధానంతరం పశ్చాత్తాపం చెందిన అశోకుడు.. ప్రజల సంక్షేమం, శాంతి, అభివృద్ధి కోసం కృషి చేశాడు. ప్రస్తుతం ప్రపంచంలో అలాంటి పరివర్తన ఎంతవరకు కనిపిస్తోంది?! వసుధైవ కుటుంబకంలో ప్రపంచమంతా ఒక కుటుంబమే. అయినప్పటికీ, ఆధిపత్య ధోరణులు, ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే శక్తులు, మతపరమైన ద్వేషాన్ని రెచ్చగొట్టే వర్గాలు యుద్ధానంతర సమాజ దుస్థితిని మరిచిపోతున్నాయి. అణ్వాయుధాలు, ఖండాంతర క్షిపణులు, అపారమైన ఆయుధ సంపత్తి శాంతిని తీసుకురాలేవు. అదే సంపదను పేదరికం, ఆకలి, వైద్యం, విద్య కోసం వినియోగిస్తే ప్రపంచం మరింత సంతోషంగా మారుతుంది. యెమెన్, సూడాన్, అఫ్ఘానిస్థాన్ వంటి దేశాల్లో ప్రజలు నేటికీ ఆకలి, నిరాశ్రయం, అనారోగ్యంతో బాధపడుతున్నారు. మానవాళిపై దయ, ప్రేమ, సహానుభూతి పెరిగినప్పుడే సుస్థిర శాంతి సాధ్యమవుతుంది. శాంతి చర్చలు కేవలం రాజకీయ ప్రయోజనాలకే పరిమితం కాకుండా మానవ సంక్షేమానికి దారి తీయాలి. ప్రపంచ శాంతి స్థాపనలో భారతదేశం తన సాంస్కృతిక వారసత్వం, అహింసా సిద్ధాంతం, “వసుధైవ కుటుంబకం” భావనల ద్వారా మార్గదర్శకత్వం వహించాలి. మరోవైపు పశ్చిమాసియాలో ఇరాన్?తో చేస్తున్న యుద్ధం అమెరికాకు తీవ్ర ఆర్థిక భారంగా మారుతోంది. 2026 ఆగస్టు నాటికి అమెరికా రక్షణ శాఖ ఈ యుద్ధం కోసం సుమారు 38 బిలియన్? డాలర్లు (సుమారు రూ.3.65 లక్షల కోట్లు) మేర ఖర్చు చేసినట్లు కాంగ్రెషనల్? బడ్జెట్ ఆఫీస్? (సీబీఓ) తాజా నివేదికలో పేర్కొంది. ఒక వేళ యుద్ధం తీవ్రత జులై నాటి స్థాయికి పెరిగితే, అమెరికా నెలవారీ యుద్ధ ఖర్చు 3 బిలియన్? డాలర్లకు చేరే అవకాశం ఉందని హెచ్చరించింది.సీబీఓ అనేది అమెరికా కాంగ్రెస్?కు, బడ్జెట్?, ఆర్థిక విశ్లేషణలు అందించే ఒక నిష్పాక్షిక సంస్థ. ఇది తాజాగా “ఇరాన్?పై అమెరికా సైనిక చర్యల ఖర్చు అంచనా” అనే పేరుతో ఒక నివేదికను









విడుదల చేసింది. అందులో ఇరాన్?తో యుద్ధానికి సంబంధించిన ఖర్చులను నాలుగు విభాగాలుగా చూపించింది. అవి ఏమిటంటే? రక్షణ శాఖ కార్యకలాపాలు, రవాణా, నిర్వహణ ఖర్చులు; ఆర్మౌట్? ఖర్చులు (ఒకదాని కోసం కేటాయించినవి మరొకదానికి వాడడం వల్ల కలిగే నష్టం); సరఫరా అంతరాయాలు, ధరల పెరుగుదల వల్ల కలిగే ఆర్థిక నష్టాలు; దౌత్యపరమైన చర్యలు, విదేశీ సాయం వంటి అదనపు ఖర్చులు. “అమెరికా రక్షణ శాఖ ఖర్చు చేసిన 38 బిలియన్ డాలర్లలో ఎక్కువ భాగం, యుద్ధంలో వాడేసిన మందుగుండు సామగ్రిని, నష్టపోయిన ఆయుధాలను మళ్లీ భర్తీ చేసుకోవడానికి ఖర్చు అయ్యింది. యుద్ధ విమానాల మోహరింపు, ఇంధనం ఖర్చు కూడా ఇందులో భాగంగా ఉంది. వాస్తవానికి యుద్ధం ప్రారంభమైన మొదట్లో ఘర్షణలు చాలా తీవ్రంగా జరిగాయి. ప్రస్తుతం తక్కువ తీవ్రతతో నామమాత్రంగా ఘర్షణలు జరుగుతున్నాయి. ఒకవేళ మే, జూన్? నెలల తరహాలోనే మళ్లీ ఘర్షణలు తీవ్రమైతే, అమెరికా అదనంగా నెలకు 2 బిలియన్? డాలర్లు (సుమారు రూ.19.182 కోట్లు) ఖర్చు అయ్యే అవకాశం ఉంది. అదే ఈ ఘర్షణలు జులై నాటి తీవ్రతకు పెరిగితే ఆ ఖర్చు నెలకు 3 బిలియన్ డాలర్లు (సుమారు రూ.28,773 కోట్లు)కు చేరుతుంది. యుద్ధం తీవ్రత మరింత పెరిగితే ఆ ఖర్చులు ఇంకా పెరగవచ్చు. రక్షణ శాఖ మాకు అవసరమైన సమాచారాన్ని అందించకపోవడం వల్ల, ప్రభుత్వ డేటాబేస్లు, బహిరంగ నివేదికల ఆధారంగా ఈ అంచనాలు వేశాం” అని సీబీఓ పేర్కొంది. జూన్?లో ట్రంప్ ప్రభుత్వం 87.6 బిలియన్ డాలర్ల అదనపు నిధులు కోరింది.అందులో రక్షణ శాఖకు సంబంధించినవే 67.1 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇందులో ఇరాన్?తో యుద్ధానికి కేటాయించినవి 42.3 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇది సీబీఓ అంచా వేసిన ఖర్చు కంటే 10 శాతం ఎక్కువ కావడం గమనార్హం.క్షిపణి రక్షణ వ్యవస్థల వాడకం భారీగా పెరగడం వల్ల అమెరికా వద్ద మిస్సైల్స్? నిల్వలు భారీగా తగ్గిపోయే ప్రమాదం ఉందని సీబీఓ ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా సైన్యానికి ఇది ఇబ్బందికర పరిణామమేనని స్పష్టం చేసింది. ఇరాన్? వర్సెస్ అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం వల్ల హర్మూజ్? జలసంధి, ఎర్ర సముద్రం ద్వారా జరిగే చమురు, సహజవాయువు రవాణాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ముడిచమురు, పెట్రోల్?, డీజిల్, జెట్ ఫ్యూయెల్? ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఈ ఇంధన ధరల పెరుగుదల వల్ల 2027 మొదటి త్రైమాసికంలో వినియోగ వస్తువుల ధరలు (పీసీఈ) ద్రవ్యోల్బణం మునుపటి అంచనాల కంటే 0.5 శాతం, కోర్ పీసీఈ ద్రవ్యోల్బణం 0.3 శాతం మేర పెరగవచ్చని భావిస్తున్నారు. ఈ ప్రభావం అమెరికా ట్రెజరీ వడ్డీ రేట్లపై కూడా పడే అవకాశం ఉందని, 2026లో మూడు నెలల ట్రెజరీ బిల్లు రేట్లు 0.2 శాతం వరకు పెరగవచ్చని సీబీఓ అంచనా వేసింది. అయితే దౌత్యపరమైన చర్యలు, విదేశీ సహాయానికి అయ్యే అదనపు ఖర్చులను ఇప్పుడే కచ్చితంగా అంచనా వేయలేమని, అది యుద్ధ ముగింపుపై ఆధారపడి ఉంటుందని సీబీఓ పేర్కొంది. ఏదేమైనా ఈ యుద్ధాలు త్వరగా ముగిసిపోతే తప్ప ప్రజలకు కాస్త ఉపశమనం లభించదు. ఆ దిశగా ప్రపంచ దేశాలు చొరవ తీసుకొని యుద్ధాలు జరిగే దేశాల మధ్య సంధి కుదిర్చి మరింత ఆర్థిక సంకోభంలోకి వెళ్ళకుండా చూడాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.




## తిరుమలలో భక్తుల కోసం 32 ఎలక్ట్రిక్ బస్సులు

**సెప్టెంబర్ 16 (ప్రజావినికిడి):** తిరుమలలో భక్తుల రాకపోకలకు వీలుగా రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక్ సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులను సీఎం జెండా ఊపి ప్రారంభించారు. రిలయన్స్ ఈ-మోబిలిటీ సీఈఓ నితిన్ సేత్, భారత్ బయోటెక్ ఎండీ సుచిత్రా ఎల్లా, మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు సహా టీటీడీ సభ్యులతో కలిసి నారాయణ గిరి సర్కిల్ నుంచి ఎస్వీ మ్యూజియం వరకూ ఎలక్ట్రిక్ బస్సులో సీఎం ప్రయాణించారు. తిరుమలకు వచ్చే ప్రతి భక్తుడికీ బీమా సదుపాయం కల్పించాలని టీటీడీ నిర్ణయించిందని సీఎం తెలిపారు. ఎల్ఐసీతో కలిసి ఆధార్ ఆధారిత ఆన్‌లైన్ బీమా అమలు చేయనున్నట్లు చెప్పారు. దురదృష్టవశాత్తూ తిరుమలలో భక్తుడు మరణిస్తే రూ.2 లక్షల ఆర్థిక సాయం అందేలా ఈ బీమా వర్తిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో 5 వేల దేవాలయాలను శ్రీవాణి ట్రస్టు ద్వారా నిర్మాణం చేపడతామన్నారు. మారిషస్, న్యూజిలాండ్ వంటి దేశాల్లో కూడా శ్రీవారి ఆలయాలు నిర్మించాలని కోరుతున్నారని, దీనిపై ఆలోచన చేస్తున్నామని తెలిపారు. శ్రీవారి సేవకులను విద్య, వైద్య రంగాల్లోనూ వినియోగించుకునేలా కార్యాచరణ చేపడుతున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఆరు అంశాల్లో తిరుమల తిరుపతి దేవస్థాన కార్యకలాపాలను పునర్వవస్థీకరిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

------------------------

## మ్రోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానంపై కాశీలో ‘సేవా సంకల్ప్ అభియాన్’

### రేపు ‘వారణాసి వాద్నగర్ సేవా యాత్ర’లో పాల్గొనున్న సీఎం చంద్రబాబు



**అమరావతిసెప్టెంబర్ 16(ప్రజావినికిడి):**పధాని మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని వారణాసిలో నిర్వహిస్తున్న ‘సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొనున్నారు. ముఖ్యమంత్రిగా, ప్రధానిగా ప్రజా జీవితంలో నరేంద్ర మోదీ చేసిన సేవలను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కాశీ నగరంలో వారణాసి?వాద్నగర్ సేవా యాత్రను చేపట్టారు. ప్రధాని మోదీ ప్రజా జీవితంతో ప్రత్యేక అనుబంధం ఉన్న వారణాసి, వాద్నగర్‌ను అనుసంధానిస్తూ ఈ సేవా సంకల్ప్ అభియాన్ లో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. యువత, ప్రజా ప్రతినిధులు, సేవా ప్రతినిధుల భాగస్వామ్యంతో ఈ సంకల్ప్ అభియాన్ చేపట్టారు. దేశ అభివృద్ధి ప్రయాణంలో ప్రజా భాగస్వామ్యం, సేవా భావం, సామాజిక బాధ్యత కీలకమనే సందేశాన్ని ‘సేవా సంకల్ప్ అభియాన్’ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లనున్నారు. ప్రతీ గ్రామం, ప్రతి కుటుంబం, ప్రతి యువత, ప్రతి మహిళ అభివృద్ధి ప్రక్రియలో భాగస్వామి కావాలనే స్ఫూర్తితో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ఏపీ సీఎం చంద్రబాబు హాజరు కానున్నారు. సీఎం చంద్రబాబు వారణాసి పర్యటనముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం ఉదయం 7.30 గంటలకు విజయవాడ నుంచి బయలుదేరి 9.35 గంటలకు వారణాసి చేరుకుంటారు. ముందుగా 11.15 గంటలకు వారణాసిలోని శ్రీ కాశీ విశ్వనాథుడ్ని ముఖ్యమంత్రి దర్శించుకోనున్నారు. అనంతరం రుద్రాక్ష్ అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్ చేరుకుని సేవా యాత్ర ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమంలో పాల్గొంటారు. తర్వాత మధ్యాహ్నం 3.10 గంటలకు వారణాసి నుంచి బయలుదేరి 5.15 గంటలకు తిరిగి అమరావతి చేరుకోనున్నారు.

## ప్రతి దశలోనూ.. రోగి భద్రత

### ఎన్‌సీడీ ద్వారా వ్యాధుల గుర్తింపు.. ‘సంజీవని’తో నిరంతర వైద్యం

### మందుల భద్రత, సురక్షిత వైద్య విధానాలకు ప్రాధాన్యం

### సెప్టెంబరు 17న ప్రపంచ రోగి భద్రతా దినోత్సవం -మంత్రి సత్యకుమార్ వెల్లడి

**అమరావతి,సెప్టెంబర్ 16(ప్రజావినికిడి):**రోగికి వైద్యం అందించడం ఎంత ముఖ్యమో.. ఆ వైద్యం వల్ల ఎలాంటి హాని కలగకుండా చూడటం కూడా అంతే ముఖ్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ తెలిపారు. వ్యాధిని ముందుగానే గుర్తించడం, సకాలంలో చికిత్స అందించడం, మందులను సురక్షితంగా వినియోగించడం, చికిత్స అనంతరం రోగి ఆరోగ్యాన్ని పర్యవేక్షించడం ద్వారా రోగి భద్రతను బలోపేతం చేయాలన్నారు. ఎన్‌సీడీ 4.0లో ఇప్పటికే 2.83 కోట్ల మందికి పైగా పరీక్షలు నిర్వహించగా.. 59.38 లక్షల మందిలో అధిక రక్తపోటు, 48.32 లక్షల మందిలో మధుమేహం గుర్తించినట్లు తెలిపారు. వ్యాధి గుర్తించిన వారికి సకాలంలో వైద్యం అందేలా ‘సంజీవని’ ద్వారా సేవలను అనుసంధానం చేస్తున్నామని చెప్పారు. సెప్టెంబర్ 17 ప్రపంచ రోగి భద్రతా దినోత్సవం



సందర్భంగా మంత్రి బుధవారం ప్రకటన విడుదల చేశారు.

రక్తపోటు, మధుమేహంతో పాటు నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వంటి అసంక్రమిత వ్యాధులను తొలిదశలోనే గుర్తిస్తే చికిత్స సులభమవుతుందన్నారు. రాష్ట్రంలో 18 ఏళ్లు పైబడిన వారికి ఎన్‌సీడీ 4.0 ద్వారా విస్తృతంగా పరీక్షలు నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. క్యాన్సర్ పరీక్షల్లో అనుమానం ఉన్న వారిని తదుపరి పరీక్షలు, అవసరమైన చికిత్స కోసం పంపిస్తున్నామని చెప్పారు. వ్యాధి గుర్తించిన తర్వాత వైద్యం అందడంలో జాప్యం లేకుండా చూడాలని వైద్యులకు సూచించారు. అవసరమైన మందులు సరైన మోతాదులో, సరైన సమయంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పరీక్షల్లో వ్యాధి ఉన్నట్లు తేలిన తర్వాత రోగికి తదుపరి వైద్యం అందడంలో ఎలాంటి అంతరాయం ఉండకూడదన్నారు. ‘సంజీవని’ ద్వారా పరీక్షలు, చికిత్స, మందులు, తదుపరి పర్యవేక్షణ వంటి సేవలను అనుసంధానం చేస్తున్నామని మంత్రి తెలిపారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు క్రమం తప్పకుండా వైద్యం పొందేలా సేవలను కొనసాగించాలని సూచించారు. ప్రతి రోగి ఆరోగ్య వివరాలను డిజిటలీకరణ చేస్తున్నామని తెలిపారు. సంజీవని ద్వారా రోగులకు ఆరోగ్య భద్రత మరింత పెరుగుతుందని చెప్పారు.రోగికి అవసరమైన మందులు సరైన మోతాదులో, సరైన సమయంలో అందడం చికిత్సలో కీలకమన్నారు. వైద్యుల సూచనల మేరకు మందులు తీసుకునేలా రోగులకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. రోగులు తాము గతంలో తీసుకున్న చికిత్స, ప్రస్తుతం వాడుతున్న మందుల వివరాలను వైద్యులకు స్పష్టంగా తెలియజేయాలని, సొంతంగా మందుల మోతాదును మార్చడం లేదా నిలిపివేయడం చేయకూడదని తెలిపారు.

## ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి నమూనాగా తిరుమల

### భక్తుల అనుభూతిని పెంచేలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్

### రూ.104 కోట్లతో ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియం ప్రారంభం

### భక్తుల సౌకర్యార్థం 32 ఈవీ బస్సులు అందించిన రిలయన్స్, భారత్ బయోటెక్

### తిరుమల వచ్చే భక్తులకు ఎల్ఐసీ ఆధ్వర్యంలో రూ.2 లక్షల బీమా

### రాష్ట్రంలో 5 వేల శ్రీవారి ఆలయాల నిర్మాణం లక్ష్యం

### - సీఎం చంద్రబాబు



**తిరుమల,సెప్టెంబర్ 16 (ప్రజావినికిడి):** తిరుమలను పవిత్రమైన దివ్యక్షేత్రంగా, ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి నమూనాగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. తిరుమలలో భక్తులకు మెరుగైన అనుభూతిని అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, ఆధ్యాత్మికత, సేవాభావం, ఆధునిక సాంకేతికతను సమన్వయం చేస్తామని చెప్పారు. తిరుమల కొండల్లో 89.5 శాతం గ్రీన్ కవర్ ఉందని, దీన్ని మరింత పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం తిరుమలలో పలు అభివృద్ధి కార్యక్రమాలను సీఎం ప్రారంభించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1 వద్ద ఏర్పాటు చేసిన పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియం, రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక్ సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులను సీఎం జెండా ఊపి ప్రారంభించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో శ్రీవారికి నిర్వహించే నిత్య కైంకర్యాలు, పూజా కార్యక్రవ, తిరుమలలోని వివిధ ప్రాంతాలను త్రీడీ సాంకేతికత ద్వారా భక్తులు వీక్షించే అవకాశం కల్పించారు. 6 డీవీఆర్ వర్చువల్ రియాలిటీ ద్వారా తిరుమల దర్శన అనుభూతిని ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించారు. గతంలో ఉన్న ఎస్వీ మ్యూజియాన్ని ఆధునీకరించి పునః ప్రారంభించారు. శ్రీవారి వైభవం, తిరుమల చరిత్ర, పురాణ గాథలు, శ్రీవారి పరిణయం తదితర అంశాలను భక్తులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ప్రదర్శించేలా టీటీడీ ఈ మ్యూజియాన్ని సిద్ధం చేసింది. టీసీఎస్ ట్రస్ట్ రూ.104 కోట్లతో మ్యూజియాన్ని అభివృద్ధి చేసింది. శ్రీకృష్ణదేవరాయలు సహా వివిధ రాజులు శ్రీవారికి సమర్పించిన ఆభరణాల నమూనాలు, వివిధ కాలాలకు చెందిన చారిత్రక వస్తువులు, స్వామివారికి అలంకరించే కిరీటాలు, ఆభరణాల త్రీడీ నమూనాలను మ్యూజియంలో ఏర్పాటు చేశారు. పానోరమిక్ స్క్రీన్‌పై ఏఐ వీడియో ద్వారా శ్రీవారి పరిణయ విశేషాలను ముఖ్యమంత్రి తిలకించారు. శ్రీవారి సేవకోసం, స్వామి వారిని కీర్తించేందుకు ఆనాటి సంగీత కారులు వినియోగించిన వాయిద్య పరికరాలను కూడా మ్యూజియంలో సీఎం ఆసక్తిగా పరిశీలించారు.

## ఆసియా గేమ్స్‌లో టీమ్‌ఇండియాకు

# విప్రజ్ నిగమ్ ఎంపిక



ఒక ఆటగాడి గాయం కారణంగా ఇంకో ఆటగాడికి జట్టులో చోటు దక్కడం ఏ ఆటలోనైనా మామూలుగా జరిగేదే. తాజాగా టీమ్‌ఇండియా జాతీయ జట్టులోనూ అదే జరిగింది. అయితే ఈసారి జట్టులో చోటు దక్కించుకోనున్న ప్లేయర్‌కు మాత్రం ఇది అరంగేట్రం కానుండడం విశేషం. గతేడాది ఐపీఎల్‌లో టోర్నమెంట్‌లో రాణించిన 22ఏళ్ల దిల్లీ క్యాపిటల్స్ బౌలర్‌కు ఆసియా గేమ్స్‌లో ఆడే అవకాశం దక్కినట్లు తెలుస్తోంది. మరో మూడు రోజుల్లో ఆసియా గేమ్స్ ప్రారంభం కానున్న నేపథ్యంలో టీమ్‌ఇండియాకు రీసెంట్‌గా ఎదురుదెబ్బ తగిలింది. దిల్లీ వేదికగా ఇటీవల అఫ్గానిస్థాన్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి 'సైడ్ స్ట్రెయిన్' (పక్కటెముకల వద్ద కండరాల గాయం)కు గురయ్యాడు. దీంతో అతడు ఈ సిరీస్‌లో మిగిలిన మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అయితే ఈ సిరీస్‌తోపాటు వరుణ్ ఆసియా గేమ్స్ నుంచి కూడా దూరమయ్యాడు. దీంతో సెలక్టర్లు అతడి రిప్లేస్‌మెంట్‌గా ఐపీఎల్ స్టార్, స్పిన్ ఆల్‌రౌండర్ విప్రజ్ నిగమ్‌ను ఎంపిక చేసినట్లు ప్రముఖ వార్తా సంస్థ పీటీఐ తమ రిపోర్ట్‌లో పేర్కొంది. "గాయం కారణంగా వరుణ్ కొద్దిరోజులు అందుబాటులో ఉండడు. అతడు గాయం నుంచి కోలుకోవాల్సి ఉంది. దీంతో అతడు ఈ పోటీలకు దూరమయ్యాడు. అయితే అతడి రిప్లేస్‌మెంట్ కోసం సెలక్టర్ల జాబితాలో విప్రాజ్ నిగమ్, కుల్దీప్ యాదవ్ ఇద్దరి పేర్లు ఉన్నాయి. అయితే లెగ్ స్పిన్నర్ కమ్ ఆల్‌రౌండ్ విప్రజ్ నిగమ్ వైపే సెలక్టర్లు మొగ్గు చూపించారు. రాబోయే ఆసియా గేమ్స్‌లో వరుణ్ స్థానాన్ని విప్రజ్ నిగమ్ భర్తీ చేయనున్నాడు" అని బీసీసీఐ వర్గాలు చెప్పినట్లు పీటీఐ పేర్కొంది. విప్రాజ్ నిగమ్ బౌలింగ్‌తోపాటు బ్యాటింగ్‌లోనూ మెరుపులు మెరిపించగలడు. 2025లో ఐపీఎల్‌లో ఎంట్రీ ఇచ్చిన అతడు ఆకట్టుకున్నాడు. ఈ టోర్నీలో తన బ్యాటింగ్ నైపుణ్యాన్ని కూడా ప్రదర్శించాడు. టీ20ల్లో స్ట్రైక్ రేట్ 176గా ఉండడం విశేషం. విప్రాజ్ బంతితో రాణించడమే కాకుండా, లోయార్డర్‌లో వేగంగా పరుగులు సాధించగల సామర్థ్యం అతడికి ఉంది. కాగా, ఆఫ్ఘానిస్థాన్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లోని మొదటి మ్యాచ్‌లో 35 ఏళ్ల వరుణ్ చక్రవర్తి గాయపడ్డాడు. మ్యాచ్ తర్వాత అతను అసౌకర్యంగా ఉన్నట్లు తెలిపాడు. ఆ తర్వాత అతడికి ఎమ్ఆర్ఐ స్కాన్ చేయించగా, పక్కటెముకల్లో గాయం ఉన్నట్లు తేలింది. దీంతో అతడిని బీసీసీఐ 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'కు పంపించారు. అక్కడ కొన్ని రోజులు రిహబిలిటేషన్ చేయనున్నాడు. ఇటీవలే హ్యామ్‌స్ట్రింగ్ సమస్య నుంచి కోలుకుని జాతీయ జట్టులోకి తిరిగి వచ్చిన వరుణ్ మళ్లీ తొలి మ్యాచ్‌లోనే గాయపడడం అతడికి పెద్ద ఎదురుదెబ్బగా మారింది. కాగా, కుల్దీప్‌ను కాదని విప్రజ్‌ను ఎంపిక చేయడంపై ఓ కారణం ఉంది. ఈనెలలో ఆఖరి వారంలో భారత్ జట్టు వెస్టిండీస్‌తో వన్డే సిరీస్ ఆడాల్సి ఉంది. ఇందులో కుల్దీప్ బరిలో దిగనున్నాడు. అందుకే విప్రజ్‌ను ఆసియా గేమ్స్‌కు పంపించారు.జపాన్‌లోని ఐచి- నగోయాలో సెప్టెంబర్ 19 నుంచి ఆసియా క్రీడలు ప్రారంభం కానున్నాయి. పురుషుల క్రికెట్ పోటీలు సెప్టెంబర్ 24న మొదలవుతాయి. అయితే భారత జట్టు నేరుగా క్వార్టర్-ఫైనల్ దశ నుంచే తన పోరాటాన్ని ప్రారంభిస్తుంది.

# వైభవ్‌తో పోటీ బయటి ప్రపంచానికి మాత్రమే



అఫ్గానిస్తాన్‌తో జరిగిన రెండో టీ20 పోరులో 160 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో టీమ్ ఇండియా ఏ దశలోనూ ఒత్తిడికి లోనుకాకుండా, ఆడుతూ పాడుతూ టార్గెట్ చేజ్ చేసింది. ఓపెనర్లు సంజూ శాంసన్, అభిషేక్ శర్మ తొలి వికెట్‌కు 88 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని జోడించారు. కేవలం 22 బంతుల్లోనే 57 పరుగులు సాధించి సంజూ ఫామ్‌లోకి రావడంతో భారత్ 14.5 ఓవర్లలోనే విజయాన్ని అందుకుంది. ఈ మెరుపు ఇన్నింగ్స్‌తో 15 ఏళ్ల వండర్‌కిడ్ వైభవ్ సూర్యవంశీతో పోటీ గురించి వస్తున్న ఊహాగానాలకు సంజూ తనదైన శైలిలో స్పందించాడు. ఫామ్ అనేది తాత్కాలికం, క్లాస్ ఎప్పటికీ శాశ్వతం అని మరోసారి నిరూపించాడు. మ్యాచ్ అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఓపెనింగ్ స్థానం కోసం నెలకొన్న తీవ్ర పోటీపై అడిగిన ప్రశ్నకు సంజూ దీటుగా ఆన్సరిచ్చాడు. ఓపెనింగ్ బెర్త్‌ల వివాదంపై సంజూ శాంసన్ స్పందిస్తూ, "బయటి ప్రపంచానికి మాత్రమే వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ నాకు పోటీదారులుగా కనిపిస్తారు. కానీ డ్రెస్సింగ్ రూమ్‌లో మేమంతా ఒకే జట్టుగా దేశం కోసం ఆడుతున్నాం. మాకు జట్టు విజయం మాత్రమే ముఖ్యం, ఆ తర్వాతే వ్యక్తిగత ప్రదర్శనలు వస్తాయి. అతడికి అవకాశం ఇచ్చారు, నాకు ఎందుకు రాలేదు అని బాధపడుతూ నెగెటివ్ ఆలోచనలతో కూర్చోవడం మా జట్టు సంస్కృతిలో లేదు. అలాంటి మనస్తత్వాలు ఇక్కడ పనికిరావు" అని పేర్కొన్నాడు. సోషల్ మీడియాలో మాజీ క్రికెటర్లు చేసే వ్యాఖ్యల గురించి సంజూ శాంసన్ మాట్లాడుతూ, "సాధారణంగా నేను వైఫై ఆఫ్ చేసి నెగెటివిటీకి దూరంగా ఉంటాను. కానీ కొన్నిసార్లు ఆ కామెంట్లు నా కంట పడుతుంటాయి. ఇండియాలో ఆడుతున్నప్పుడు ఇలాంటి కామెంట్లు ఆటగాళ్లపై ప్రభావం చూపుతాయి. మేం రోబోలం కాదు, మాకు భావోద్వేగాలు ఉంటాయి. గతంలో విమర్శలు నన్ను కూడా బాధించాయి. అయితే అనుభవంతో వాటిని ఎలా ఎదుర్కోవాలో నేర్చుకున్నాను. ఒక షాట్ ఆడే ముందు బయట ఏమనుకుంటారో అని ఆలోచిస్తే నేను ఇలా బ్యాటింగ్ చేయలేను" అని తెలిపాడు. మొదటి రెండు మ్యాచ్‌ల్లో సంజూ, అభిషేక్‌లు రాణించినప్పటికీ, బెంచ్‌పై ఉన్న వైభవ్ సూర్యవంశీకి మూడో టీ20లో అవకాశం ఇస్తామంటూ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సూచన ప్రాయంగా చెప్పాడు. దీంతో ఆఖరి పోరులో ఎవరికి విశ్రాంతి ఇస్తారనేది ఆసక్తిగా మారింది. ఇక ఈ ఈ సిరీస్ ను ఇప్పటికే 2-0తో ఇండియా కైవసం చేసుకోగా, స్వదేశంలో శ్రేయస్ కిదే తొలి సిరీస్ విక్టరీ కావడం విశేషం.

## కొచ్చి వేదికగా అక్టోబర్‌లో

# మెగా ఆక్షన్ నిర్వహణ..





### ● డబ్ల్యూపీఎల్ 2027 తేదీలు ఖరారు

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ఐదో సీజన్ నిర్వహణకు సంబంధించి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) బుధవారం కీలక ప్రకటన విడుదల చేసింది. డబ్ల్యూపీఎల్ 2027 ఎడిషన్ మ్యాచ్‌లను 2027 జనవరి 14 నుంచి ఫిబ్రవరి 7 వరకు నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. ఈ కొత్త సీజన్ కోసం ఆటగాళ్ల మినీ వేలాన్ని ఈ ఏడాది అక్టోబర్ 28న కేరళలోని కొచ్చి నగరంలో జరుపుతారు. అయితే ఈ టోర్నీ మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చే వేదికల వివరాలను మాత్రం బీసీసీఐ ప్రస్తుతానికి వెల్లడించలేదు. మహిళల క్రికెట్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద టీ20 లీగ్‌గా అవతరించిన డబ్ల్యూపీఎల్, సరికొత్త ప్రతిభను వెలికితీయడంలో కీలక పాత్ర పోషిస్తోందని బోర్డు తన అధికారిక ప్రకటనలో తెలిపింది. ఇండియా అంతర్జాతీయ స్టార్లతో పాటు వర్ధమాన క్రీడాకారిణులు తమ సత్తా చాటేందుకు ఈ లీగ్ గొప్ప వేదికగా నిలిచింది.రాబోయే సీజన్ కోసం ఐదు ఫ్రాంచైజీలు తమ జట్లను సిద్ధం చేసుకోవడంపై కసరత్తు చేస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న జట్ల నుంచి ఆటగాళ్లను అట్టిపెట్టుకోవడానికి బీసీసీఐ సెప్టెంబర్ 28ని ఆఖరి గడువుగా నిర్ణయించింది. ఈ గడువు లోగా ఫ్రాంచైజీలు తాము రిటైన్ చేసుకునే ఆటగాళ్ల జాబితాను సమర్పించాల్సి ఉంటుందని తెలుస్తోంది. రాబోయే సీజన్‌కు సరిపడే అత్యుత్తమ కాంబినేషన్‌లను ఎంపిక చేసుకోవడానికి జట్లకు ఇది మంచి అవకాశం. 2026 ఎడిషన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) సంచలన ఆటతీరుతో రెండోసారి డబ్ల్యూపీఎల్ ట్రోఫీని కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన సారథ్యంలో బరిలోకి దిగిన ఆర్సీబీ, అద్భుత ప్రదర్శనతో టైటిల్ నిలబెట్టుకుంది. ఆ సీజన్ మ్యాచ్‌లను నవీ ముంబై, బరోడాలలో విజయవంతంగా నిర్వహించారు. ఇప్పుడు జరగబోయే ఐదో సీజన్‌లోనూ విజేతగా నిలిచి హ్యాట్రిక్ సాధించాలని ఆర్సీబీ బృందం కృతనిశ్చయంతో ఉంది. ఇందుకు తగిన కసరత్తు ముమ్మరం చేస్తోంది ఆ టీమ్ మేనేజ్మెంట్. 2023లో ఆరంభమైన డబ్ల్యూపీఎల్ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు చెరో రెండుసార్లు ఛాంపియన్లుగా నిలిచాయి. కొచ్చిలో జరిగే వేలం తర్వాత ఐదు ఫ్రాంచైజీలు కొత్త వ్యూహాలతో బరిలోకి దిగనున్నాయని తెలుస్తోంది. ఇక మిగతా జట్లు కూడా విజేతగా నిలిచేందుకు వ్యూహాలు పన్నుతున్నాయి.

# భారత్‌లోనే జరగనున్న ఐపీఎల్ 2027 వేలం



గత కొన్ని ఏళ్లుగా విదేశాల్లో ఐపీఎల్ వేలాన్ని నిర్వహించే ట్రెండ్‌కు బీసీసీఐ బ్రేక్ వేసింది. మంగళవారం జరిగిన ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ కీలక సమావేశంలో 2027 ఐపీఎల్ మినీ వేలాన్ని మన భారతదేశంలోనే నిర్వహించాలని నిర్ణయించారు! 2023లో కొచ్చిలో జరిగిన వేలం తర్వాత దుబాయ్, జెడ్డా, అబుదాబి వంటి విదేశీ నగరాల్లో వేలాలు జరిగాయి. అయితే, 2028లో నిర్వహించే మెగా వేలాన్ని మళ్లీ విదేశాల్లో నిర్వహించే అవకాశం ఉన్నప్పటికీ, ఈసారి మినీ వేలాన్ని మాత్రం స్వదేశంలోనే నిర్వహించనున్నారు. మినీ వేలం కోసం తమ యాజమాన్యం, విశ్లేషకుల బృందాలను విదేశాలకు తీసుకెళ్లడం వల్ల తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఫ్రాంచైజీలు బీసీసీఐకి విన్నవించాయి. గతేడాది అబుదాబి వేలం సందర్భంగానే టీమ్స్ ఈ అభ్యంతరాలను బీసీసీఐ దృష్టికి తీసుకెళ్లాయి. ఫ్రాంచైజీల అభిప్రాయాలకు గౌరవమిస్తూ, వేలాన్ని భారతదేశంలోని ఏదో ఒక నగరంలో నిర్వహించాలని ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ నిర్ణయించింది.అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య కాలం భారతదేశంలో వివాహాల సీజన్ కావడంతో, వేలం వేదిక ఎంపిక కాస్త సవాలుగా మారింది. వేలం నిర్వహణతో పాటు 10 ఫ్రాంచైజీల బృందాలు, బీసీసీఐ అధికారుల వసతి కోసం కనీసం 100కి పైగా 5-స్టార్ హోటల్ గదులు రెండు రోజుల పాటు అవసరం అవుతాయి. హోటల్ గదుల లభ్యతను బట్టి ఏ భారతీయ నగరంలో వేలం నిర్వహించాలనేది త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. మరోవైపు ఐపీఎల్‌లో ఎంతో వివాదాస్పదమైన 'ఇంపాక్ట్ ప్లేయర్' నియమంపై బీసీసీఐ ఇంకా ఏటూ తేల్చలేదు. ఈ రూల్‌ను కొనసాగించాలా వద్దా అనే దానిపై ఫ్రాంచైజీలలో విభిన్న అభిప్రాయాలు ఉన్నాయి. జట్టు నిర్మాణాన్ని ఈ నియమాన్ని బట్టే రూపొందించుకున్నామని, కాబట్టి దీనిపై హడావుడిగా కాకుండా వచ్చే ఏడాది నిర్ణయం తీసుకోవాలని కొన్ని జట్లు కోరుతున్నాయి. దీనిపై స్పష్టత కోసం మరో నెల రోజుల్లో ప్రత్యేకంగా గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం కానుంది.

## స్విమ్మింగ్‌లో మెరిసిన

# మనీశ్ గౌడ్

### - ఓయూ ఇంటర్‌కాలేజ్ స్విమ్మింగ్ పోటీలు



హైదరాబాద్ : ఉస్మానియా యూనివర్శిటీ ఇంటర్ కాలేజ్ స్విమ్మింగ్ పోటీల్లో కె. మనీశ్ గౌడ్ (సెయింట్ జోసెఫ్ కాలేజ్) సత్తా చాటాడు. మెన్స్ 100 మీటర్ల, 200మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ విభాగంలో పసిడి పతకం సాధించాడు. 50మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో రజత పతకం నెగ్గాడు. బద్రుకా కాలేజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలు అంబర్‌పేట్ స్విమ్మింగ్‌పూల్‌లో జరుగగా.. ఎన్‌జిఐటి, ఎసీఎంఈ, కేశవ్ మెమోరియల్ ఇంజినీరింగ్ కాలేజ్‌లు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచాయి. ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ ప్రొ.సునీల్ కుమార్, ఐయూటీ సెక్రటరీ ప్రొ. దీప్ల, బద్రుకా కాలేజ్ ప్రిన్సిపాల్ మోహన్ కుమార్‌లు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

# వేగం పెంచిన రజనీకాంత్..

## ‘ధర్మన్’ షూటింగ్‌పై అప్‌డేట్ ఇచ్చిన దర్శకుడు

సూపర్ స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న భారీ చిత్రం ‘ధర్మన్’ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా మూడో షెడ్యూల్ బుధవారం ప్రారంభమైంది. ఈ విషయాన్ని దర్శకుడు అశ్వత్ తన ఎక్స్ ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించారు.
షూటింగ్ సెట్స్ నుంచి ఒక ఆసక్తికరమైన బిహైండ్-ది-సీన్స్ (బీటీఎస్) వీడియో క్లిప్‌ను ఆయన పంచుకున్నారు. ఈ వీడియోలో సూపర్ స్టార్ రజనీకాంత్, నటి రాశి ఖన్నాతో ముచ్చటిస్తూ కనిపించారు. “ధర్మన్ మూడో షెడ్యూల్ కోసం మళ్లీ తలైవర్‌తో కలిశాను“ అంటూ ఈ పోస్ట్‌కు క్యాప్షన్ జోడించారు. ఈ క్లిప్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.
ఇటీవలే సెప్టెంబర్ 4న ఈ చిత్ర రెండో షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ సమయంలో చిత్ర నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్.. రజనీకాంత్ ఒక సీనియర్ మెడికల్ ఫ్యాకల్టీగా జూనియర్ డాక్టర్లకు పాఠాలు చెబుతున్న సన్నివేశాలతో కూడిన వీడియోను విడుదల చేసింది. ఈ లుక్‌కు అభిమానుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది.
ఈ చిత్రాన్ని లోకనాయకుడు కమల్ హాసన్ తన సొంత నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మిస్తున్నారు. కమల్ నిర్మాణంలో రజనీ నటిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ‘ధర్మమే వెల్లుమ్’ (ధర్మమే గెలుస్తుంది) అనే ట్యాగ్‌లైన్‌తో కమల్ హాసన్ స్వయంగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించారు.
ఈ చిత్రంలో రజనీకాంత్ ఒక వైద్యుడి పాత్రలో నటిస్తూనే, సమాజంలోని నేరస్థులను శిక్షించే శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారని ప్రచారం జరుగుతోంది. గతంలో విడుదలైన టైటిల్ పోస్టర్‌లో ఆపరేషన్ థియేటర్‌లో స్కాల్‌పెల్ చేతిలో పట్టుకుని, ఒక రౌడీ మృతదేహంపై కాలు వేసి ఉన్న రజనీకాంత్ లుక్ సినిమాపై ఉత్కంఠను మరింత పెంచింది.
ఈ చిత్రానికి యువ సంచలనం అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, నికేత్ బొమ్మి సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీతలైన అన్బరివ్ ద్వయం స్టంట్స్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. వరుస షెడ్యూళ్లతో సినిమాను వేగంగా పూర్తి చేసేందుకు చిత్ర యూనిట్ ప్రణాళికలు రచిస్తోంది.




# సంపూ.. ఈ బిర్యానీ క్లిక్కయితే..

# సంపూర్ణేష్ బాబు



సంపూర్ణేష్ బాబు పేరు వినగానే ఇప్పటికీ హృదయ కాలేయం, సింగం 123, కొబ్బరి మట్ట లాంటి సినిమాలే ముందుగా గుర్తొస్తాయి. స్పూఫ్ కామెడీతో అతనికి ఒక డిఫరెంట్ ఇమేజ్ వచ్చింది. మొదట్లో అదే కొత్తగా అనిపించి సినిమాలకు మంచి క్రేజ్ కూడా తెచ్చింది. కానీ తర్వాత అదే తరహా సినిమాలు కొనసాగడంతో సంపూను మరో రకమైన పాత్రలో ఊహించే అవకాశం దర్శకులకు కూడా పెద్దగా రాలేదు. హీరోగానే చేయాలనే పట్టుదలతో మాత్రం సంపూ ఉండలేదు. కరెంట్ తీగలో చిన్న పాత్ర చేశారు. అల్లరి నరేష్ బందిపోటులోనూ కనిపించారు. జ్యోతిలక్ష్మి, రాజా ది గ్రేట్, దేవదాస్ లాంటి సినిమాల్లో కూడా చిన్న పాత్రలు, స్పెషల్ పాత్రలు చేశారు. అయితే వాటిలో ఏదీ కెరీర్‌ను మరో లెవెల్ కు తీసుకెళ్లేంత పెద్ద క్యారెక్టర్ కాలేదు. మెయిన్ స్ట్రీమ్ సినిమాల్లో సంపూకి రెగ్యులర్‌గా పాత్రలు రావడం కూడా జరగలేదుమార్టిన్ లూథర్ కింగ్ మాత్రం కొంచెం వేరే ప్రయత్నం. అందులో కామెడీ ఇమేజ్‌ను తగ్గించి రెగ్యులర్ పాత్రలో కనిపించారు. కొన్ని రివ్యూల్లో కూడా సంపూ నటన గురించి మంచి కామెంట్స్ వచ్చాయి. అప్పటివరకు కనిపించిన ఓవర్ ది టాప్ స్టైల్‌కు భిన్నంగా సహజంగా చేశారని పేర్కొన్నారు. కానీ ఆ సినిమా తర్వాత కూడా అలాంటి పాత్రలు ఎక్కువగా వచ్చినట్లు కనిపించలేదు. ఇప్పుడు ది ప్యారడైజ్‌లో బిర్యానీ పాత్ర ఆ గ్యాప్‌ను మార్చే అవకాశం తీసుకొచ్చింది. ఇందులో సంపూ నానికి ఫ్రెండ్‌గా సినిమా మొత్తం కనిపిస్తారని చెప్పారు. ఇది చాలా సీరియస్ క్యారెక్టర్ అని, ఇలాంటి పాత్ర తన కెరీర్‌లో ఇప్పటివరకు చేయలేదని కూడా వెల్లడించారు. ఈ పాత్ర కోసం బరువు తగ్గడంతో పాటు జుట్టు, గడ్డం కూడా పెంచారు. సినిమా పూర్తయ్యే వరకు మరో ప్రాజెక్ట్ ఒప్పుకోలేదని చెప్పారు. లేక కథలో బలమైన సపోర్టింగ్ క్యారెక్టర్ ఇచ్చినా నిలబడగలరా? అనే సందేహం చాలా కాలంగా ఉంది. బిర్యానీ పాత్రలో కామెడీ కంటే సీరియస్ షేడ్ ఎక్కువగా ఉంటే, దర్శకులు ఆయనను చూసే విధానం కూడా మారే అవకాశం ఉంటుంది. హీరో పాత్రల కంటే ఇలాంటి క్యారెక్టర్లు కెరీర్ కు ప్లస్ అయ్యే చాన్స్ ఉంది. ది ప్యారడైజ్ సెప్టెంబర్ 24న థియేటర్లలోకి వస్తోంది. శ్రీకాంత్ ఓదెల ఈ పాత్ర కోసం స్పెషల్ గా సంపూను ఎంచుకున్నారు. సాయి రాజేష్ సలహా మేరకు ఆ అవకాశం వచ్చినట్లు తెలుస్తోంది. చాలా కాలం తరువాత పెద్ద సినిమా రావడంతో సంపూర్ణేష్ బాబు ఇక కొత్తగా మరతడాని అనిపిస్తోంది. ఇక సినిమా కంటెంట్ ఆ పాత్రను ఎంతవరకు ఎలివేట్ చేస్తుందో చూడాలి.

# డేవిడ్ రెడ్డిలో రమ్యకృష్ణ ..

## ఫస్ట్‌లుక్‌తో అంచనాలు పెంచిన మేకర్స్



మంచు మనోజ్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా ‘డేవిడ్ రెడ్డి’లో రమ్యకృష్ణ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆమె పోషిస్తున్న ‘కమలా రెడ్డి’ పాత్రను పరిచయం చేస్తూ చిత్రబృందం మంగళవారం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. రమ్యకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఈ పోస్టర్‌ను రిలీజ్ చేయడం విశేషం.
పోస్టర్‌లో రమ్యకృష్ణ చాలా గంభీరంగా, పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్నారు. ఆమె పాత్ర సినిమాలో కీలకంగా ఉండబోతున్నట్లు లుక్ చూస్తే అర్థమవుతోంది. ఈ పోస్టర్‌ను మంచు మనోజ్ తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేశారు. రమ్యకృష్ణతో కలిసి నటించడం గౌరవంగా ఉందని పేర్కొన్నారు. ఆమె స్క్రీన్ ప్రెజెన్స్, పాత్రపై పట్టు అద్భుతమని ప్రశంసించారు.
ఇప్పటికే ఈ సినిమాలో ఉక్రెయిన్ మోడల్, నటి మరియా రియాబోషప్కా ‘క్లారా విట్‌మోర్’గా నటిస్తున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. ఆమె పాత్ర ప్రేమతో పాటు ప్రతీకారం, పోరాటంతో ముడిపడి ఉంటుందని చిత్రబృందం గతంలో తెలిపింది.‘డేవిడ్ రెడ్డి’కి హనుమా రెడ్డి యక్కంటి దర్శకత్వం వహిస్తున్నారు. వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. 1897 నుంచి 1922 మధ్య కాలంలో కథ సాగనుంది. చరిత్ర నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ డ్రామాలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు అంశాలు ఉండనున్నాయి.మంచు మనోజ్ సినీ ప్రయాణం 21 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గత ఏడాది ఆగస్టులో ఈ సినిమాను ప్రకటించారు. తన కెరీర్‌లో ఇది 21వ చిత్రమని అప్పట్లో వెల్లడించారు.

# ఇది మా 20 ఏళ్ల ‘లవ్ అండ్ వార్’..

## మరోసారి పెళ్లి ప్రమాణాలు చేసుకున్న సూర్య, జ్యోతిక!



ప్రేక్షకులు ఎంతగానో ఆరాధించే తారల జంట సూర్య, జ్యోతిక తమ 20వ వివాహ వార్షికోత్సవాన్ని వినూత్నంగా జరుపుకున్నారు. ఈ ప్రత్యేకమైన సందర్భాన్ని పురస్కరించుకుని వారు మరోసారి పెళ్లి ప్రమాణాలు చేసుకున్నారు. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ వేడుక ఎంతో ఆత్మీయంగా జరిగింది. ఈ వేడుకకు సంబంధించిన ఒక అందమైన వీడియోను జ్యోతిక సోషల్ మీడియాలో పంచుకున్నారు. “మా 20 ఏళ్ల లవ్ అండ్ వార్‌కి ఇది సీక్వెల్“ అంటూ ఆమె వ్యాఖ్యానించారు.
“మాది పరిపూర్ణమైన వివాహం కాదు. ఎన్నో లోపాలు, సర్దుబాట్లు, అవగాహన, త్యాగాలు, నిస్వార్థమైన ప్రేమతో కూడిన బంధం ఇది“ అంటూ తన మనసులోని మాటలను పంచుకున్నారు.
ఈ వేడుకలో వారి పిల్లలు దియా, దేవ్ కూడా పాల్గొన్నారు. తల్లి జ్యోతిక చేయి పట్టుకుని కుమారుడు దేవ్ వేదిక వద్దకు నడిపించడం అందరినీ ఆకట్టుకుంది.
ఈ కార్యక్రమానికి జ్యోతిక తెల్లని బ్రైడల్ గౌన్‌లో, సూర్య తెల్లని టక్సేడోలో మెరిసిపోయారు. సూర్య సోదరుడు, నటుడు కార్తీ కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు.
2006 సెప్టెంబర్ 11న వివాహం చేసుకున్న ఈ జంట, 1999లో ‘పూవెల్లం కెట్టుప్పార్‘ సినిమా సెట్‌లో మొదటిసారి కలుసుకున్నారు. ప్రస్తుతం ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# గణపతి నిమజ్జనంలో సల్మాన్ ఖాన్ హుషారు.. నవ్వుతూ కెమెరాలకు పోజులు



డు సల్మాన్ ఖాన్ తన సోదరుడు సోహైల్ ఖాన్ నివాసంలో నిర్వహించిన గణపతి నిమజ్జన వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ వేడుకలో ఆయన ఎంతో ఉత్సాహంగా, చిరునవ్వుతో కనిపించి అందరినీ ఆకట్టుకున్నారు. మంగళవారం సాయంత్రం ముంబై బాంద్రా వెస్ట్‌లోని సోహైల్ ఇంటికి చేరుకున్న ఆయన, అక్కడ వేచి ఉన్న ఫోటోగ్రాఫర్లకు చిరునవ్వుతో పోజులిచ్చారు.
తలపాగా ధరించి, ప్రింటెడ్ జీన్స్, జాకెట్‌లో స్టైలిష్‌గా కనిపించిన సల్మాన్.. అక్కడ ఉన్న ఒక ఫొటోగ్రాఫర్‌ను చూసి సరదాగా నవ్వారు. అక్కడున్న ఒక చిన్నారితో పాటు ఆమె తల్లిదండ్రులతో కూడా ఆయన ముచ్చటించారు. గణపతికి హారతి ఇచ్చే క్రమంలో సల్మాన్ చిన్న పొరపాటు చేయగా, వెంటనే ఆయన సోదరి అర్పితా ఖాన్ దానిని సరిదిద్దారు. ఈ ఆసక్తికర దృశ్యం అక్కడున్న వారిని అలరించింది.ఖాన్ కుటుంబం ప్రతి ఏటా గణేశ్ చతుర్థి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తుంది. సల్మాన్ తండ్రి సలీం ఖాన్ ముస్లిం, తల్లి సుశీలా చరక్ (సల్మా) హిందూ, అలాగే సవతి తల్లి హెలెన్ క్రైస్తవ మతానికి చెందినవారు కావడంతో, ఈ కుటుంబం జరుపుకునే పండుగలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయి. ఈ వేడుకల్లో సల్మాన్‌తో పాటు ఇలియా వంతూర్, నటుడు వరుణ్ శర్మ తదితరులు కూడా పాల్గొన్నారు. అనంతరం, సోహైల్ ఖాన్ నివాస ఆవరణలోనే ఏర్పాటు చేసిన ప్రత్యేక నీటి తొట్టిలో గణనాథుడి నిమజ్జనాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613